ప్రజాశక్తి

సోమవారం 10 మార్చి 2025 — 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

కలగానే టిడ్కో గృహాలు...

- ఎనిమిదేళ్లుగా లబ్ధిదారుల ఎదురుచూపు
- రూ.800 కోట్ల బిల్లుల పెండింగ్‌తో నిర్మాణ పనులు నిలిపివేత
- ఉయ్యూరు, మచిలీపట్నంలో అసంపూర్తిగా 3,504 గృహాలు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

ఎనిమిదేళ్లయినా పట్టణాల్లోని వేలాది మంది టిడ్కో లబ్ధిదారులకు జి ప్లస్ త్రీ గృహాలు అందుబాటులోకి రాలేదు. తాజాగా బిల్లులు చెల్లించలేదనే కారణంతో కాంట్రాక్టు సంస్థ గృహ నిర్మాణాలను నిలిపివేసింది. ఇటువంటి పరిస్థితుల్లో తమ సొంతింటి కల ఎప్పటికి నెరవేరుతుందో లబ్ధిదారులకు తెలియడంలేదు. ప్రజా చైతన్య యాత్రల్లో భాగంగా సిపిఎం నేతలు శనివారం అసంపూర్తిగా నిలిచిపోయిన టిడ్కో గృహాలను పరిశీలించారు. వీటిని పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఉయ్యూరు, మచిలీపట్నంలో అసంపూర్తిగా గృహాలు

పట్టణ ప్రాంతాల్లో నెలవారీ అద్దెలు చెల్లించడానికి అవస్థలు పడుతున్న ప్రజల సొంతింటి కలను నెరవేరుస్తామని ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ టౌన్ షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపి డిడ్కో)ను ఏర్పాటు చేసింది. అప్పటి డిడిపి ప్రభుత్వం 2017లో కృష్ణాజిల్లాలోని మచిలీపట్నం నగరం, గుడివాడ, పెడన, ఉయ్యూరు పట్టణాల్లో 28,336 మందిని టిడ్కో గృహాల లబ్ధిదారులుగా గుర్తించింది. లబ్ధిదారుల నుంచి వివిధ కేటగిరీల కింద నిర్దేశించిన మొత్తాన్ని డిపాజిట్‌గా చెక్కుల రూపంలో వసూలు చేసింది. గత వైసిపి ప్రభుత్వం వివిధ కారణాలను చూపుతూ 14,624 గృహాలను రద్దు చేసింది. భూ సేకరణ జరగకపోవడంతో పెడనలో గృహాల నిర్మాణం నిలిపివేశారు. మచిలీపట్నంలో 2,304, గుడివాడలో అత్యధికంగా 8,912, ఉయ్యూరులో 2,496 చొప్పున మొత్తం 13,712 గృహాలను నిర్మిస్తామని చెప్పింది. ఐదేళ్లపాటు నిర్మాణ పనులు నత్తనడకన సాగాయి. వీటిలో గుడివాడలో 8,912 గృహాలు, మచిలీపట్నంలో 1,296 గృహాలను మాత్రమే ప్రభుత్వం లబ్ధిదారులకు పంపిణీ చేసింది. ఉయ్యూరులో 2,496 గృహాలు 80 శాతం, మచిలీపట్నంలో 1,008 గృహాలు 97 శాతం నిర్మాణం పూర్తయ్యాయి. ఈ రెండు చోట్ల 3,504 గృహాలు అసంపూర్తిగా ఉండటంతో లబ్ధిదారులు ఆ గృహాల్లోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గృహాలకు వేలాది రూపాయలు డిపాజిట్లు చెల్లించిన లబ్ధిదారులు నెలవారీ అద్దెల భారాన్ని మోయాల్సి వస్తోంది. మచిలీపట్నంలో మూడు శాతం, ఉయ్యూరులో 20 శాతం పెండింగ్ పనులు పూర్తి చేసి గృహాల్లోకి వెళ్లేందుకు అవకాశం కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

పనులు నిలిపివేసిన ఎల్ అండ్ టి

రాష్ట్ర వ్యాప్తంగా ఎల్ అండ్ టి సంస్థ టిడ్కో జి ప్లస్ త్రీ గృహాల నిర్మాణానికి కాంట్రాక్టు దక్కించుకుంది. గుడివాడలో ఈ సంస్థ చేపట్టిన గృహాలను పూర్తి చేసింది. టిడ్కో కాలనీల్లో మౌలిక వసతులు కల్పన చేపట్టింది. అయితే రాష్ట్ర వ్యాప్తంగా పూర్తయిన పనులకు సంబంధించి రూ.800 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే కాంట్రాక్టు సంస్థ టిడ్కో గృహాల పనులను నిలిపివేసినట్లు తెలిసింది.

నిరాశలో ఆశావహులు

- దక్కని ఎంఎల్‌సి టికెట్లు
- దేవినేని ఉమా శకం ముగిసినట్లేనా !
- రాధా భవిష్యత్తేంటి ?
- టిడిపి శ్రేణుల్లో అసంతృప్తి
- నెట్టెం, టిడి, బుద్దా, నాగుల్ మీరా, అశోక్‌బాబు ఆశలు గల్లంతు

ప్రజాశక్తి - కంచికచర్ల, మైలవరం : ఎంఎల్‌సి అభ్యర్థుల జాబితాలో ఎన్‌టిఆర్ జిల్లాకు ప్రాధాన్యత దక్కలేదు. అభ్యర్థుల ఎంపికపై కసరత్తు పూర్తి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం రాత్రి అభ్యర్థులను ప్రకటించారు. అయితే అభ్యర్థుల జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో జిల్లాకు చెందిన నేతలు తీవ్ర నిరాశకు గురయ్యారు. గత ఎన్నికల్లో సీటు త్యాగం చేసిన జిల్లాలో సీనియర్ నాయకుడైన మాజీ మంత్రి దేవినేని ఉమా, వంగవీటి రంగా తనయుడు, కాపు సామాజిక వర్గంలో రాష్ట్ర స్థాయి గుర్తింపు కలిగిన వంగవీటి రాధా, మరో మాజీ మంత్రి, టిడిపి సీనియర్ నేత తొండెపు జశరథ జనార్ధన్, టిడిపి జిల్లా కన్వీనర్ నెట్టెం రఘురాం, మాజీ ఎంఎల్‌సి, బిసి నేత బుద్దా వెంకన్న, టిడిపి నాయకులు షేక్ నాగుల్ మీరాతోపాటు సిట్టింగ్ ఎంఎల్‌సి పి.అశోక్‌బాబు ఎంఎల్‌సి సీటును ఆశించారు. అయితే వీరిలో దేవినేని ఉమా, వంగవీటి రాధా పేర్లు ముందు వరుసలో ఉన్నాయి. అభ్యర్థుల జాబితాలో చోటు కోసం వీరంతా ఎంతో ఉత్కంఠగా ఎదురుచూశారు. అయితే ఆశావహుల్లో ఎవరికీ సీటు దక్కలేదు. జనసేన నుండి కాపు సామాజిక వర్గానికి చెందిన కొణిదెల నాగబాబుకు దక్కటంతో వంగవీటి రాధాకు సీటు రాలేదని ఆయన అనుచరులు చెబుతున్నారు. అలాగే ఇటీవల జరిగిన ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికల్లో గెలుపొందిన ఆలపాటి రాజా, దేవినేని ఉమా ఒకే సామాజిక వర్గం కావటంతో దేవినేనికి సీటు దక్కలేదని ఆయన అంటున్నారు.

దేవినేని ఉమా రాకుండా చక్రం తిప్పిన ఎంపి శివనాథ్, ఎంఎల్‌ఎ వసంత ?

మాజీ మంత్రి, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేనిని ఉమా శకం ముగిసినట్లేనని జిల్లాలో ప్రచారం సాగుతోంది. నాలుగుసార్లు ఎంఎల్‌ఎగా గెలిచి మంత్రిగా పనిచేసి, ప్రతిపక్షంలో ఉండగా, అధికార పక్షాన్ని ఇరుకున పెట్టిన ఉమా శకం రాజకీయంగా ఇక ముగిసనట్లేనని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. దీనికి కారణం లేకపోలేదని చర్చ సాగుతోంది. విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), మైలవరం ఎంఎల్‌ఎ వసంత కృష్ణ ప్రసాద్ ఇద్దరూ దేవినేనికి ఎంఎల్‌సి టికెట్

(మిగతా 2లో)

పేదల సమస్యలపై తుదిశ్వాస వరకూ పోరాడిన ప్రకాశరావు

- సంస్మరణ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - చల్లపల్లి : నమ్మిన సిద్ధాంతం కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం శీలం ప్రకాశరావు పోరాడారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణాజిల్లా అధ్యక్షులు, సిపిఎం నాయకులు శీలం ప్రకాశరావు సంస్మరణ సభ ఆదివారం కృష్ణాజిల్లా మొవ్వలో జరిగింది. సిపిఎం మండల కార్యదర్శి శీలం నారాయణరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పనుల కల్పన, వేతనాల కోసం ప్రకాశరావు పోరాడారని గుర్తుచేశారు.

సంస్మరణ సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, వేదికపై వై.నరసింహారావు, ఎం.హరిబాబు తదితరులు

వ్యవసాయ కార్మికుల సమస్యలపై నిత్యం ఉద్యమాలు నిర్వహించారని కొనియాడారు. వ్యవసాయ కార్మిక కుటుంబంలో పుట్టి

(మిగతా 2లో)

భళా...గన్నవరం బాలోత్సవం..

వార్త 5లో

10-3-2025 సోమవారం
ఇఫ్తార్ (సాయంత్రం) : 6.21
11-03-2025 మంగళవారం
సహర్ (ఉదయం) : 5.00

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు

- నిర్వహణకు 145 కేంద్రాలు
- ప్రజాశక్తితో కృష్ణాజిల్లా డిఇఒ రామారావు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

పదో తరగతి పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు కృష్ణాజిల్లా విద్యాశాఖ అధికారి పి.వి.జె.రామారావు తెలిపారు. ఈనెల 17 నుండి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు జిల్లాలోని 145 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని చెప్పారు. ఆన్‌లైన్, వాట్సప్‌లో విద్యార్థులు హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఆయా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. టెన్త్ పరీక్షల నిర్వహణపై ఆయన ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న :జిల్లాలో ఎంత మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు?

ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలో 22,341 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. వీరిలో 11,770 మంది బాలురు, 10,571 మంది బాలికలు ఉన్నారు. ఆన్‌లైన్‌లోనూ, 9552300009 సెల్ నంబర్ వాట్సప్‌కు సందేహాన్ని పంపి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షా కేంద్రాల్లోకి నేరుగా వెళ్ల వచ్చు.

ప్రశ్న : ఎన్ని పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు? మౌలిక వసతులు కల్పిస్తున్నారా?

జిల్లాలో 145 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశాం. పోలీస్ స్టేషన్, సబ్ ట్రెజరీ కార్యాలయాల అందుబాటును ప్రామాణికంగా తీసుకుని పరీక్ష కేంద్రాలను గ్రేడ్లు ఇచ్చాం. 70 ఏ కేటగిరీలో, 23 బి కేటగిరీ, 52 సి కేటగిరీ కేంద్రాలు ఉన్నాయి. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఉంటుంది. 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు వెళ్లి వచ్చేందుకు వీలుగా ఆర్‌టిసి బస్సు సర్వీసులను ప్రభుత్వం అందుబాటులో ఉంచుతోంది. విద్యార్థులు పరీక్షలు రాయడానికి అనుగుణంగా పరీక్ష కేంద్రాల్లో బల్లలు ఏర్పాటు చేస్తున్నాం. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఆయా కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచుతున్నాం.

ప్రశ్న : పరీక్షల నిర్వహణకు ఎంత మంది సిబ్బందిని నియమించారు?

ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. పరీక్షల నిర్వహణ, పర్యవేక్షణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. వివిధ కేడర్లలో 458 మందిని నియమించాం. 145 మంది సూపరింటెండెంట్లు, 145 మంది డిపార్టుమెంటల్ ఆఫీసర్లను నియమించాం. 30 మంది మెటీరియల్ పంపిణీకి రూట్ ఆఫీసర్లు, మెటీరియల్ స్టోరేజీ పాయింట్లలో, సి కేటగిరీ పరీక్ష కేంద్రాల్లో 52 మంది కస్టోడియన్ ఆఫీసర్లు, పరీక్ష కేంద్రాల పర్యవేక్షణకు 52 మందితో స్క్వాడ్, ఐదుగురిని ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బందిని నియమించాం.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-విజయవాడ : కలెక్టరేట్ లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుండి అర్జీల స్వీకరణ చేపట్టనున్నట్టు తెలిపారు.

19న విఎంసి బడ్జెట్ సమావేశం

●21న సాధారణ కౌన్సిల్●11న స్థాయి సంఘం సమావేశం

●పది రోజుల వ్యవధిలో నాలుగు సమావేశాలు

ప్రజాశక్తి - విజయవాడ : ఈ నెల 19వ తేదీన నగరపాలక సంస్థ బడ్జెట్ (2025-26)పై కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని అధికార వైసిపి నిర్ణయించింది. ఈ మేరకు నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మీ సంబంధిత అధికారులతో బడ్జెట్ రూపకల్పనపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించినట్లు తెలిసింది. ఆయా సమావేశాల షెడ్యూల్స్‌ను మేయర్ ఇప్పటికే విడుదల చేసినట్లు తెలిసింది. ఈ సమావేశానికి ముందు ఈ నెల 11వ తేదీన బడ్జెట్‌పై స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించి, దానిలో సమగ్రంగా చర్చించి, బడ్జెట్‌కు తుదిరూపం ఇవ్వనున్నారు. ఈ సమావేశంలో ఏఏ పద్దుల కింద ఎంతెంత కేటాయింపులు చేయాలి అనే దానిపై చర్చించి తద్వారా బడ్జెట్ ఫైనల్ చేస్తారు. దీనికి ముందు స్టాండింగ్ కమిటీ సాధారణ సమావేశం ఈ నెల 10వ తేదీన జరపాలని నిర్ణయించారు. కౌన్సిల్ నిబంధనల ప్రకారం... ప్రతి మూడు మాసాలకొక సారి నిర్వహించాల్సిన కౌన్సిల్ సమావేశాన్ని ఈ నెల 21వ తేదీన నిర్వహించాలని ఇప్పటికే మేయర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కౌన్సిల్ అజెండాకు తుదిరూపం ఇవ్వాలని సెక్రటరీ సెల్ అధికారులను మేయర్ సూచించారు. ఈనెల 10వ తేదీ నుంచి 21వ తేదీ (పది రోజుల వ్యవధి) లోపులో రెండు సార్లు స్థాయి సంఘం, మరో రెండు సార్లు కౌన్సిల్ సమావేశాలు జరుగుతాయి. నిబంధనల ప్రకారం ఈ సమావేశాలు గత నెలలోనే నిర్వహించాల్సి ఉండగా, మధ్యలో గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో ఈ సమావేశాలకు చాలా ఆలస్యం అయిందని అధికార, విపక్షాలు వ్యక్తం చేస్తున్నాయి. రెండు సార్లు స్థాయి సంఘం సమావేశాలకు...రెండు సార్లు కౌన్సిల్ సమావేశాలకు మధ్యలో కేవలం వారం రోజుల మాత్రమే గడువు ఉండటం గమనార్హం. అయితే అధికార వైసిపి కౌన్సిల్‌లో అధికార పగ్గాలు చేపట్టి ఈ నెల 18వ తేదీకి సరిగ్గా నాలుగు సంవత్సరాలు పూర్తవుతాయి.

పీ4 కార్యాచరణలో భాగస్వాములుకండి

కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి-విజయవాడ : సమగ్రాభివద్ధి లక్ష్యంగా గౌరవ ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించిన స్వర్ణాంధ్ర ఏ 2047లో భాగంగా పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు జీరో పావర్టీ-పీ4 విధానం అమలుకు కసరత్తు జరుగుతోందని.. ఈ ప్రయాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు.స్వర్ణాంధ్రఏ2047 విజన్ డాక్యుమెంట్‌లోని పది సూత్రాల్లో మొదటి సూత్రమైన శూన్య పేదరికం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్ (పీ4) విధానానికి ఉగాది నుంచి శ్రీకారంచుట్టనుందని.. ప్రభుత్వం, దాతలు, ప్రజాభాగస్వామ్యంతో పేదరికం లేని సమాజం లక్ష్యంగా ఈ పీ4 విధానం అమలుకానుందని వివరించారు. ముఖ్యంగా యువతకు జ్ఞానం, నైపుణ్యాలు అందించడం, ప్రతిఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు, సుస్థిర ఉపాధి అవకాశాల సష్టి, వద్ధికి దోహదం చేసే మౌలిక వసతుల కల్పనపై దష్టిసారించేందుకు ఇది తోడ్పడుతుందన్నారు. సమాజం నుంచి పేదరికాన్ని దూరం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికాయుతంగా చేపడుతున్న కార్యక్రమాలకు తోడు సామాజికంగా, ఆర్థికంగా పైన ఉన్న కుటుంబాలు సామాజిక బాధ్యతగా అట్టడుగున ఉన్న కుటుంబాలకు మద్దతుగా నిలిచేలా భాగస్వాములను చేయడం పీ4 విధానమని పేర్కొన్నారు. ఈ బహత్తర కార్యక్రమంపై ప్రజల నుంచి సూచనలు తీసుకోవడం జరుగుతోందన్నారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఈ నెల 25వ తేదీలోగా అభిప్రాయాలు తెలియజేసి.. ప్రతి ఇంటికీ అభివద్ధి, ప్రతి జీవితానికీ ప్రగతిలో భాగస్వాములు కావాలని, మీ సలహాలను ప్రశంసిస్తూ ఒక ప్రశంసా పత్రం కూడా అందించడం జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

విఎంసిలో నేడు గ్రీవెన్స్

ప్రజాశక్తి - విజయవాడ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం యదావిధిగా నిర్వహించనున్నట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విఎంసి ప్రధాన కార్యాలయంతో పాటు మూడు సర్కిల్స్ కార్యాలయాల్లో ప్రజాఫిర్యాదుల దినోత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి గుర్రం నాని దాతృత్వం

● రూ. 10 లక్షలతో సిమెంట్ రోడ్లు నిర్మాణం

ప్రజాశక్తి-గన్నవరం : మండలంలోని దావాజి గూడెం, అల్లాపురం గ్రామాల ఉమ్మడి హిందూ శ్మశాన వాటిక అభివద్ధికి ప్రముఖ బిల్డర్ గుర్రం నాని ముందుకువచ్చారు. ఆయన పెదనాన్న, పెద్దమ్మ గుర్రం సుబ్బయ్య, శేషరత్నం, భార్య రజనీ జ్ఞాపకార్థం రూ. 10 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల పనులు ఆదివారం చేపట్టారు. స్మశానవాటిక అభివద్ధి కమిటీ పర్యవేక్షణలో ప్రధాన రహదారితో పాటు మరో రెండు అంతర్గత రోడ్ల నిర్మాణం జరుగుతోంది. ఈ పనులు పూర్తయితే శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. ఈ సందర్భంగా గుర్రం నాని మాట్లాడుతూ ఉమ్మడి గ్రామాల హిందూ స్మశానవాటిక అభివద్ధికి సహకరించాలని గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు తనను కోరడంతో స్పందించినట్లు వివరించారు. ఇటువంటి అభివద్ధి కార్యక్రమం ద్వారా జన్మభూమి రుణం తీర్చుకున్నట్లు అవుతుందన్నారు. ఇప్పటికే అల్లాపురం గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణంతో పాటు మినరల్ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేసి ప్రజాప్రయోజన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్ లో కూడా ఇరు గ్రామాల ప్రజల అవసరాలకు అనుగుణంగా తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానని స్పష్టం చేశారు. జీవితంలో ఎంత సంపాదించామనేది ముఖ్యం కాదని, సామాజిక సేవకు ఎంత సాయం చేశామనేది ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. అడిగిన వెంటనే స్పందించి శ్మశానవాటిక అభివద్ధికి తోడ్పాటునందించిన గుర్రం నానికి బుధవారం సర్పంచ్ బడుగు బాలమ్మ, అభివద్ధి కమిటీ సభ్యులు నరసయ్య, గొంది పూర్ణచంద్రరావు తదితరులు అభినందనలు తెలియజేశారు.

రోడ్డు పనులు జరుగుతున్న దృశ్యం

వెండి కిరీటం బహూకరణ

ప్రజాశక్తి-అవనిగడ్డ : మండల పరిధిలోని పులిగడ్డ గ్రామం లో గల కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలోని కనకదుర్గమ్మకు హైదరా బాదుకు చెందిన తోట బాలాజీ ఈశ్వరుని దంపతులు రూ 50 వేల విలువచేసే 500 గ్రాముల వెండి కిరీటాన్ని అందజేశారు. ఆదివారం ఆలయ నిర్వహకులు మండలి వెంకటకష్ణారావు(బాబు) కు అందజేశారు.

నిరాశలో ఆశావహులు

(మొదటి పేజీ తరువాయి)

రాకోకుండా చక్రం తిప్పారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రస్తుతం లోకేష్ టీంలో ఉన్న ఈ ప్రజా ప్రతినిధులిద్దరూ లాబీయింగ్ నడిపారని తెలుగు తమ్ముళ్లే వ్యాఖ్యానిస్తున్నారు. ఉమాకు ఎంఎల్‌సిగా ఎన్నికైతే ప్రత్యామ్నాయంగా వర్గాన్ని కూడకడతారని, తమకు కొరకురాని కొయ్యగా మారతారనే ఉద్దేశంతో మంత్రి లోకేష్‌తో మంతనాలు సాగించి అడ్డుకున్నారని ఆ పార్టీ నాయకులే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. నందిగామ నుంచి దిగుమతి నేతగా మైలవరం వచ్చి రెండుసార్లు గెలిచి టిడిపి ఉమ్మడి కష్ణాజిల్లా అధ్యక్షుడిగా, జల వనరుల శాఖ మంత్రిగా వ్యవహరించిన ఉమాను కాదని 2024లో ఎన్నికల్లో వైసిపి నుంచి వచ్చిన వసంత కష్ణ ప్రసాద్‌కు పార్టీ అధిష్టానం మైలవరం టిడిపి సీటును కేటాయించింది. దీంతో ఉమా అనుచరుల్లో అసంతృప్తి నెలకొంది. నిన్న మొన్నటి వరకు మైలవరం నియోజకవర్గంలోని కొంత మంది టిడిపి నేతలు ఉమాకు ఎంఎల్‌సి సీటు కచ్చితంగా వస్తుందని విస్తతంగా ప్రచారం చేశారు. కానీ అభ్యర్థుల జాబితాలో ఆయన పేరు లేకపోవడంతో ఉమా అనుచరులు తీవ్రంగా నిరాశ చెందారు. ఈ నేపథ్యంలో తన రాజకీయ భవిష్యత్తు కోసం ఉమా ఏ నిర్ణయం తీసుకుంటారో ఆయన అనుచరులు ఎదురుచూస్తున్నారు.

సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ చుట్టూ ప్రదక్షిణలు

టిడిపి ఎంఎల్‌సిలు యనమల రామకష్ణుడు, పి.అశోక్‌బాబు, బీటీ నాయుడు, దువ్వారపు రామారావు పదవీ కాలం ఈనెల 29తో ముగుస్తోంది. అలాగే జంగా కష్ణమూర్తి సార్వత్రిక ఎన్నికలకు ముందు వైసిపికి, ఎంఎల్‌సి పదవికి రాజీనామా చేసి టిడిపిలో చేరారు. 2024 మే 15 నుంచి ఆ స్థానం ఖాళీగా ఉంది. ఈ ఐదు స్థానాలకు ఇప్పుడు ఎన్నిక జరుగుతోంది. ఈ ఎన్నికలు టిడిపి ఆశావహుల్లో తీవ్ర ఉత్కంఠ రేపాయి. ఐదు స్థానాల్లో మిత్ర పక్షాలైన జనసేన, బిజెపిలకు టిడిపి కేటాయించింది. జనసేన తరపున కొణిదెల నాగబాబు ఇప్పటికే నామినేషన్ దాఖలు చేశారు. అయితే మిగిలిన నాలుగు స్థానాల్లోనూ టిడిపి పోటీ చేస్తుందని భావించారు. అయితే చివరి నిమిషంలో ఒక స్థానాన్ని బిజెపికి కేటాయించారు. ఈ స్థానానికి బిజెపి తమ అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది. మిగిలిన మూడు స్థానాల కోసం టిడిపిలో తీవ్ర పోటీ నెలకొంది. సుమారు 25 మంది వరకు పదవులు ఆశించారు. ముఖ్యంగా సుమారు 10 మంది వరకు తీవ్రంగా ప్రయత్నించారు. కొందరు నేరుగా వెళ్లి అధినేత చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ను అడుగగా, మరికొందరు తమకు మద్దతుగా ఇతర నాయకులను తీసుకెళ్లి అడిగించారు. కష్టకాలంలో పార్టీకి చాలా సేవ చేశామని, గట్టిగా నిలబడ్డామని చెబుతూ.. అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈనెలాఖరుతో పదవీ విరమణ చేస్తున్న ఎంఎల్‌సిల్లోనూ కొందరు మళ్లీ అవకాశం ఇవ్వాలని పట్టుబడ్డారు. చంద్రబాబు, లోకేశ్‌ని కలిసి తమ అనుకూలతలను వివరించారు. అమరావతిలోనే మకాం వేసిన కొందరు ఆశావాహులు.. కచ్చితంగా తమకు అవకాశం వస్తుందన్న నమ్మకంతో నామినేషన్ వేసేందుకు అవసరమైన పత్రాలను సిద్ధం చేసుకున్నారు. ఆఖరి నిమిషంలో ఇబ్బంది పడకుండా ముందే ఏర్పాట్లు చేసుకుని సిద్ధంగా ఉన్నారు. అయితే టిడిపి అధినేత ప్రకటించిన జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో తీవ్రంగా నిరాశ చెందారు. సోమవారంతో నామినేషన్ గడువు ముగియనుండటంతో ఆదివారం రాత్రే అభ్యర్థుల జాబితాను టిడిపి అధినేత ప్రకటించారు. బిసి, ఎస్‌సి సామాజిక వర్గాల వారికి కేటాయించారు. రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లోంచి ఒక్కొక్కరిని ఎంపిక చేసింది. ఈసారి బిజెపికి ఒక సీటు ఇచ్చినందున సర్దుబాటు చేయలేకపోతున్నామని, 2027లో ఏడు ఎంఎల్‌సి స్థానాలకు ఖాళీలు ఏర్పడుతున్నందున అప్పుడు అవకాశం కల్పిస్తామని ఆశావహులకు పార్టీ పెద్దలు సర్ది చెబుతున్నట్లు తెలిసింది. ఈ మేరకు టీడీ జనార్దన్, బుద్ధా వెంకన్న, పి.అశోక్‌బాబులకు అధిష్టానం నుంచి ఫోన్లు వెళ్లినట్టు సమాచారం.

పేదల సమస్యలపై తుదిశ్వాస వరకూ పోరాడిన ప్రకాశరావు

(మొదటి పేజీ తరువాయి)

ఉపాధి కార్మికుల కోసం, పేదల సమస్యల పరిష్కారం కోసం పోరాడిన ప్రకాశరావు బాటలో యువత నడవాలని పిలుపునిచ్చారు. సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ ప్రకాశరావు ఉపాధి హామీ మేటుగా జీవితాన్ని ప్రారంభించి ఉపాధి మేట్ల సంఘానికి రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారని గుర్తుచేశారు. ఆ తర్వాత కాలంలో వ్యవసాయ కార్మిక సంఘం నేతగా, సిపిఎం నాయకుడిగా అనేక ఉద్యమాలకు నేతృత్వం వహించారని కొనియాడారు. భూ సమస్యలు, ఉపాధి సమస్యలు, కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. ఆయనను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ ప్రాంతం నుండి భాస్కరరావు, ప్రకాశరావు అత్యంత పేద కుటుంబాల నుంచి వచ్చి నాయకత్వ స్థాయికి ఎదిగారని వివరించారు. చివరి వరకూ ప్రజల కోసం జీవించారని చెప్పారు. ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రకాశరావు కషి చేశారని చెప్పారు. తోట్లవల్లూరు మండలంలోని ఇసుక క్వారీ సమస్య, రహదారుల అభివృద్ధికి పోరాడారని తెలిపారు. ఈ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోసూరు శివ నాగేంద్రం, ఎపి కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పంచకర్ల రంగారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యద్దనపూడి మధు, ఐద్వా రాష్ట్ర నాయకులు చేబ్రోలు బసవపూర్ణ, ప్రముఖ న్యాయవాది గొరిపర్తి శ్రీనివాసరావు, గొరిపర్తి వెంకటరమణ తదితరులు ప్రసంగించారు. తొలుత ప్రకాశరావు చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

సభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు

గ్రామ పంచాయతీ కార్యాలయం, పెదఆవుటపల్లి

ఉంగుటూరు మండలం, కృష్ణాజిల్లా.

టెండరు ప్రకటన

ఆర్ఓసి నెం: 3/2025-2026 **తేది.07-03-2025**

కృష్ణాజిల్లా, ఉంగుటూరు మండలం, పెద ఆవుటపల్లి పంచాయతీ నందు ఈ దిగువ తెల్పిన పనులు నిర్వహించుటకు గ్రామ కాంట్రాక్టు లేబరు ఏజన్సీ పద్దతి ద్వారా తీసుకొనుటకు టెండరులు కోరబడుచున్నవి. సదరు టెండర్లు ది.15-03-2025 తేదీన శనివారం మధ్యాహ్నము గం.12-00 లకు కార్యదర్శి గారిచే లేక వారి అనుమతి పొందిన వారిచే గాని పంచాయితీ కార్యలయములో టెండర్లు స్వీకరించబడును. తదుపరి మధ్యాహ్నం గం.3-00 లకు హాజరైన వారి సమక్షంలో టెండర్లు తెరవబడును. కావున ఇతర వివరములు కార్యాలయము పని చేయు వేళల్లో తెలుసుకొనవచ్చును.

వ.నెం	పని వివరములు	పనివారి సంఖ్య	టెండరు డిపాజిట్టు	కాలపరమితి
1.	పారిశుధ్య పనుల కొరకు	10	రూ 1000/- లు (ఒక్కొకరికి)	01-04-2024 నుండి 31-04-2025 వరకు (ఒకసంవత్సరం)
2.	వాటర్ వర్క్సు	8	-డిటో-	-డిటో-
3.	వీధి లైట్లు	2	-డిటో-	-డిటో-
4.	ట్రాక్టర్ డ్రైవర్ (లైసెన్సు)	1	-డిటో-	-డిటో-
5.	కంప్యూటర్ ఆపరేటరు	1	-డిటో-	-డిటో-

నోటు : 1) నిధులు నిల్వను బట్టి నెలకు ఒక పర్యాయము సొమ్ము చెల్లించబడును.
2) డిపాజిట్లు చెల్లించని వారి టెండర్లు స్వీకరించబడవు
3) పనిలో అనుభవం వున్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
4)ఏకారణము చేతనైను టెండరు వాయిదా వేయు అధికారము గ్రామపంచాయతీ కార్యదర్శికి అధికారము గలదు
5)వ్యక్తులు పనులకు సరిగా హాజరు కాకపోతే పనిలోనుండి తీసివేయబడును.

బి.తిరుపతమ్మ
సర్పంచ్,
గ్రామపంచాయతీ, పెద ఆవుటపల్లి.

జె.యోహోను
పంచాయతీ కార్యదర్శి,
గ్రామపంచాయతీ, పెద ఆవుటపల్లి.
ఉంగుటూరు మండలం, కృష్ణాజిల్లా.

జగనన్న కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

• సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-చల్లపల్లి : జగనన్న కాలనీలో సమస్యలు పరిష్కంచాలని మొవ్వ మండల సిపిఎం కార్యదర్శి శీలం నారాయణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మొవ్వ మండల పరిధిలోని పెదపూడి గ్రామపంచాయతీ శివారు జగనన్న కాలనీ, దళితవాడలలో ఆదివారం పర్యటించి సమస్యలను పరిశీలించారు. కాలనీలో స్థానిక ప్రజలను కలుసుకుని సమస్యలను అడిగి తెలుసుకున్నారు జగనన్న కాలనీలో తాగునీటి సమస్య, ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులు, విద్యుత్ సమస్యలు ఉన్నాయని సిపిఎం బందానికి కాలనీవాసులు వివరించారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల క్రితం జగనన్న కాలనీకి 238 మందికి ప్లాట్లు ఇచ్చారని, దీనిలో 100 మంది నిర్మాణాలు చేపట్టగా 40 కుటుంబాలు నివాసం ఉంటున్నారన్నారు. వీరంతా కూలి పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. కాలనీలో నెలకొని ఉన్న తాగునీటి సమస్యలను పరిష్కారానికి తాగునీరుకు వాటర్ పైపులైన్ నిర్మాణం చేపట్టి పైపులకు కనెక్షన్ ఇవ్వలేదన్నారు. .ఇంకా నాలుగు బజార్లకు పైపులైన్ వాటర్ ఇవ్వవలసి ఉందన్నారు. వర్షాకాలం వస్తే ఆరు నెలల పాటు మురుగునీరు నిల్వ ఉంటుందని, దీనివలన ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కాలనీ సమస్యలు పరిష్కారం కోసం గత మూడు సంవత్సరాల నుంచి మండల కార్యాలయాల వద్ద, కలెక్టర్ ఆఫీసుల వద్ద స్పందన కార్యక్రమాల ద్వారా కాలనీవాసులు అర్జీలు సమర్పించిన నేటి వరకు ఎటువంటి చలనం లేదని

కాలనీలో మౌలిక సదుపాయాలు పరిశీలిస్తున్న బృందం

విచారం వ్యక్తం చేశారు. కాలనీలో సమస్యలపై సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించని పక్షంలో ఈనెల రెండవ వారంలో సచివాలయం వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కాకి రాజశేఖర్, పార్టీ సభ్యులు చిగురుపల్లి సుబ్రహ్మణ్యం, పార్టీ సీనియర్ నాయకులు అయినంపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ఆర్టీసీ బస్సు సైకిల్ పై వెళ తున్న వద్ధుడిని ఢీకొట్ట డంలో ఆ వృద్ధుడు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన గుడ్లవల్లేరు మండలంలో ఆదివారం జరిగింది. . పోలీసులు తెలిపిన ప్రకారం మండలంలోని కవుతరం గ్రామ ఎం ఎన్ కె రహదారి పక్కగా సైకిల్ మీద గుడ్లవల్లేరు నుండి కతవురం వైపు ఆదివారం ఉదయం ఆతుకూరి వెంకట రామ రాజు వయసు(84) సైకిల్ పై వెళుతు ఉండగా ఏలూరు నుండి మచిలీపట్నం వైపు వెళ తున్న ఆర్‌టిసి బస్సు వెనకనుంచి సైకిల్ ని ఢీకొట్టగా వెంకటరామరాజు కు తలకు బలమైన గాయం కాగా అతడు సంఘటన స్థలం వద్దే మృతిచెందాడు. మతుడు చంద్రాల గ్రామవాసిగా గుర్తించారు. గుడ్లవల్లేరు ఎస్ఐ ఎన్‌వివి సత్య నారాయణ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి డ్రైవర్ని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం'

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఈనెల 10వ తేదీ సోమవారం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం యధావిధిగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డికే బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. శాసనమండలి ఎన్నికల దష్ట్యా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్నందున కొంతకాలం పి జి ఆర్ ఎస్ (గ్రీవెన్స్) కు తాత్కాలిక విరామం ప్రకటించిన విషయం తెలిసిందే. ఎన్నికల ప్రక్రియ ముగిసినందున యధావిధిగా పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తామని దీనిలో భాగంగా కలెక్టరేట్లోని గ్రీవెన్స్ హాల్లో ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. కలెక్టరేట్ తో పాటు డివిజనల్, మండల, మున్సిపల్, సచివాలయ స్థాయిలోనూ పిజి ఆర్ఎస్ జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డికే బాలాజీ ప్రకటనలో కోరారు.

ముగిసిన ఈ పంట నమోదు

ప్రజాశక్తి-గన్నవరం : రబీ సాగుకు సంబంధించి రైతుల ఈ పంట నమోదు కార్యక్రమం ముగిసిందని ఏవో రజిని ఆదివారం తెలిపారు. ముసాయిదా జాబితాను సోమవారం నుంచి రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తామన్నారు. రైతు సేవ కేంద్రాల్లో గ్రామ సభ నిర్వహించి ఈ పంట నమోదు వివరాలు చదువుతారని తెలిపారు. రైతులు ఆయా గ్రామాలలో గ్రామ సభకు హాజరు అయి తమ వివరాలు తెలుసుకొని తమ అభ్యంతరాలు తెలియజేయాలన్నారు. ఈ పంట నమోదులో మార్పులు చేర్పులు చేసి తుది జాబితాని 22వ తారీఖున ప్రదర్శిస్తామన్నారు.

తరకటూరులో సినీ నటుడు బాబీసింహ సందడి

ప్రజాశక్తి-గూడూరు : గూడూరు మండలం తరకటూరు గ్రామంలో తెలుగు తమిళ సినీ నటుడు, (వాల్తేరు వీరయ్య ఫేమ్) బాబీ సింహ సందడి చేసారు. తన తల్లి స్వగ్రామమైన తరకటూరు గ్రామాన్ని సందర్శించి గ్రామస్తుల్ని, బంధువుల్ని కలిసి చిన్ననాటి జ్ఞాపకాల్ని నెమరవేడుకున్నారు.అనంతరం పునర్నిస్తున్న చెన్నకేశవ స్వామి దేవస్థానం ని సందర్శించి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు కాట్రగడ్డ సత్యనారాయణ, రత్నబాబు, వెంకటాచలం, కేశవ, సుధాకర్, నాగమల్లేశ్వరరావు, సమ్మెట జగదీష్, పుప్పాల సూర్య ప్రకాష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

సినీనటుడు బాబీసింహాతో గ్రామస్తులు

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల అంబేద్కర్ నగర్లో నూతనంగా అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు బౌద్ధ సంప్రదాయాలతో బౌద్ధ గురువు బంతేజీ ఆదివారం భూమిపూజ చేశారు. దాతలు, అంబేద్కర్ నగర్ వాసుల ఆర్థిక సహకారం, సమన్వయంతో అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠ, స్లాబ్ నిర్మాణాలకు బౌద్ధ గురువు బంతేజీ శంకుస్థాపన జరిపారు. గౌతమ బుద్ధుడు విగ్రహం, అంబేద్కర్ చిత్రపటం వద్ద విశేష పూజలు నిర్వహించారు. మొదట బౌద్ధ గురు బంతేజీని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జ్ఞాపికతో సత్కరించారు. బంతేజీ మాట్లాడుతూ బౌద్ధం స్వేచ్ఛ, సమానత్వం సౌభ్రాతత్వాన్ని, చాటుతుందన్నారు. ప్రపంచశాంతి, దేశ అభివద్ధికి గౌతమ బుద్ధుని బోధనలు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆలోచన విధానాల ద్వారానే

భూమి పూజ నిర్వహిస్తున్న బౌద్ధ గురువు బంతేజీ

సాధ్యమవుతుందన్నారు. అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి తమ వంతుగా బంతేజి రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-పమిడిముక్కల : కూటమి ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. ఆదివారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సిఎంఆర్ఎఫ్ చెక్కులు 19,65,179 రూపాయలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా దూసుకుపో తుందన్నారు. మండలంలో లంకపల్లి, కష్ణాపురం, తాడంకి గ్రామాల ప్రజలకు సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జక్కా శ్రీనివాసరావు, మైనేని నరేంద్ర పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ వర్ల కుమార్ రాజా

పులిగడ్డ ఆక్విడెక్ట్ రైలింగ్ పనులను పరిశీలిస్తున్న ప్రాజెక్టు చైర్మన్ అధికారులు

పులిగడ్డ అక్విడెక్ట్ రైలింగ్ పనులు పరిశీలన

ప్రజాశక్తి-అవనిగడ్డ : పులిగడ్డ ఆక్విడెక్ట్ రైలింగ్ పనులను తూర్పు కష్ణ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దేవన బోయిన వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఆదివారం ఆక్విడేట్ వద్దకు వెళ్లి పనులను పరిశీలించి విలేకరులతో మాట్లాడుతూ అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ కషి తో ఆక్విడెక్ట్ సమగ్ర అభివద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈయన వెంట ఇరిగేషన్ శాఖ డీఈఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, కోడూరు మండల జనసేన పార్టీ అధ్యక్షులు మర్రె గంగయ్య, ఉల్లిపాలెం నీటి సంఘ అధ్యక్షులు ఇజ్జినేని శివాజీ, పోచబోయిన కరుణ కుమార్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం గొడుగు పేటలో వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు శ్రీ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భముగా మొదటి రోజు లో భాగముగా పుణ్యావచన దీక్షా స్వీకరణ అంకురారోపణ ధ్వజపటం ప్రతిష్ఠ కార్యక్రమములు వైభవంగా జరిగినవి. ఈ ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ స్వామివారి తీర్థ ప్రసాదములు స్వీకరించారని దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీ కందుల వేణుగోపాలరావు తెలియజేసారు. అలాగే పెడన మండలం చేవెంద్ర గ్రామంలో శివాలయం ప్రతిష్ఠ కార్యక్రమంలో మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి ఆదివారం పాల్గొన్నారు. ఆయనకు దేవస్థానం అర్చకులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం అనంతరం వేదాశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేసారు.

ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-ఉయ్యూరు : రంజాన్ మాసం పురస్కరించుకుని దాయేరి మసీదులో ఆదివారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. ఉదయం నుంచి ఉపవాసదీక్షలో ఉన్నవారు సాయంత్రం దీక్ష విరమించి ఇఫ్తార్లో పాల్గొన్నారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ అబుకలాం, ఏజీఅండ్ ఎస్ఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ సత్తార్, జలీల్ తదిత రులు పాల్గొని సేవలందించారు. ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఉయ్యూరుబార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ఉయ్యూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. 2025-2026 సంవత్సరానికి జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా కాగిత గోపీచంద్ మూడో సారి అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా అశోక్‌కుమార్, ప్రధాన కార్య దర్శిగా శ్రీక, సంయుక్త కార్యదర్శిగా పోతురాజు శ్రీరామ్ ప్రసాద్, కోశాధికారిగా ఎల్. వసుధారాణి, గ్రంథాలయ కార్యదర్శిగా గీతాంజలి, క్రీడలు, సాంస్కృతిక విభాగ కార్యద ర్శిగా వీరప్రతాపరెడ్డి, మహిళా కార్యదర్శిగా దివ్యాంజలి ఎన్నికయ్యారు. గోపీచంద్ నాల్గవసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం విశేషం.

ఉచిత మధుమేహ వైద్య శిబిరం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక లయన్స్ సేవా భవనంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రముఖ మధుమేహ వైద్యులు డాక్టర్ గవిరనేని రజని ఆధ్వర్యంలో 123 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు .ఈ కార్యక్రమానికి దాతలు నర్రా గంగాధరరావు (వెస్టిండీస్) వల్లభనేని రామకష్ణ (యూఎస్ఏ) కొసరాజు బాపయ్య చౌదరి దాతలుగా క్లబ్ సభ్యులు చాపరాల రాజా, చాపరాల బాలాజీ, కోలా రాధాకష్ణారావు, ఈడుపుగంటి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా

చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి - మైలవరం : కొంతమంది అక్రమార్కులకు చెరువులు మట్టి కాసుల వర్షం కురిపిస్తుంది. యథేచ్ఛగా పట్టపగలే చెరువు మట్టిని ఇటుక బట్టీలకు, ప్లాట్లకు తరలిస్తున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుండటంతో పలు విమర్శలకు తావిస్తోంది. ఆదివారం మైలవరం మండలంలోని గణపవరం తూర్పు చెరువు మట్టిని అధికార పార్టీకి చెందిన ముఖ్యనాయకులు రెండు పొక్లెయిన్లు, 20 ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారని చెప్పుకుంటున్నారు. ట్రక్కు రూ.600 నుంచి రూ.1000 వరకు వసూలు చేస్తున్నారని విమర్శలు బాహాటంగా వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు ఎవరూ అటువైపు కన్నెత్తి చూడకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. పగలు, రాత్రి తేడా లేకుండా ఎప్పుడు బడితే అప్పుడు యథేచ్ఛగా మట్టిని అక్రమార్కులు తరలిస్తున్నారు. నివాస గృహాలకు మెరువ పేరుతో గుట్టు చప్పుడు కాకుండా మట్టిని తరలిస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు.

వాల్టా చట్టానికి తూట్లు..

వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ అక్రమార్కులు పొక్లెయిన్ల సహాయంతో మట్టిని తరలిస్తున్నారు. మట్టి కోసం చెరువుల్లో ఎక్కడపడితే అక్కడ గోతులు తీయడంతో వర్షాకాలంలో ఆ గోతుల్లో నీరు చెరటంతో ఆ గోతులు కనిపించక పశువులు మత్యువాత పడే అవకాశం ఉందని పలువురు రైతులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి మట్టి అక్రమంగా తరలిస్తున్న అక్రమార్కులకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

మైలవరం మండలం గణపవరం చెరువులోని మట్టిని తరలిస్తున్న దృశ్యం

నిబంధనలు పాటించకుంటే జరిమానా

ప్రజాశక్తి - విజయవాడ : వాహనదారులు సిగ్నల్ జంక్షన్ల వద్ద రెడ్ లైట్ పడినప్పుడు తప్పని సరిగా వైట్‌లైన్ వద్ద ఆగి వెళ్లాలని, అలా ఆగకుండా వెళ్తే మీ వాహనాన్ని ఆటోమేటిక్ సిగ్నలింగ్ సిస్టం ద్వారా రికార్డు చేయబడి కమాండ్ కంట్రోల్ వద్ద తప్పిదాన్ని గుర్తించి ఆన్‌లైన్ ద్వారా చలానా వేయనున్నట్లు నగర పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నగరంలోని ముఖ్యజంక్షన్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశామన్నారు. ఈ సిగ్నల్స్ ద్వారా వాహనదారులు మోటార్ వాహన చట్టానికి వ్యతిరేకంగా, ఇతర తప్పిదాలు, హెల్మెట్ ధరించక పోయిన, సీటు బెల్ట్ ధరించక పోయిన, ట్రిపుల్ రైడ్ చేసిన, సెల్‌ఫోన్ డ్రైవ్ చేసిన, రాంగ్ రోడ్ డ్రైవింగ్ చేసిన, ఓవర్ లోడ్‌తో వాహనాన్ని నడిపినా, ఆటో డ్రైవర్లు ఖాకి షర్ట్ ధరించకపోయిన, ఇతర తప్పిదాలు చేసినా ఆటో మేటిక్ సిగ్నలింగ్ సిస్టం ద్వారా రికార్డు చేసి మీరు చేసిన తప్పిదాలకు ఆన్‌లైన్ ద్వారా చలానా వేయబడుతుందని అన్నారు. నగరంలో వాహనదారులు పైవిషయాలను గమనించి ఎటువంటి తప్పిదాలు చేయకుండా వాహన చట్టాలకు అనుగుణంగా వాహనాలు నడపాలని కోరారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా తమ తమ గమ్యస్థానాలు చేరుకోవాలని నగర పోలీసు కమిషనర్ తెలిపారు.

యువకులతో పోలీసులు

అడవిలో తప్పిపోయిన యువకులను కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి కిల్లాను సందర్శించి తిరుగు ప్రయాణంలో అడవిలో దారి తప్పిపోయిన యువకులను ఇబ్రహీంపట్నం పోలీసులు సురక్షితంగా అడవి నుండి తీసుకువచ్చిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. విజయవాడకు చెందిన గార్లపాటి పాల్ కృపా కిషోర్, ఉప్పలపాటి జస్వంత్, మరొక వ్యక్తి దార జాయ్ అభిషేక్ కలిసి కొండపల్లి ఖిల్లాను సందర్శించి తిరుగు ప్రయాణంలో దారి తప్పిపోయి అడవిలోకి వెళ్లిపోయి, చీకటి పడటంతో దారి తెలియక పోలీసు 112 కాల్ సెంటర్‌కు ఫోన్ చెయ్యగా ఇబ్రహీంపట్నం పోలీసు వారు వెంటనే స్పందించి, వాని స్టేషన్ కానిస్టేబుల్స్ ప్రసాదు, దేవయ్య అను వారిని కొండపల్లి ఖిల్లా వద్ద తప్పిపోయిన ప్రదేశం వద్దకు పంపి, దారి తప్పిపోయిన వారికి గూగుల్ మ్యాప్ ద్వారా డైరెక్షన్ ఇస్తూ, బెల్ హెల్పర్స్ ద్వారా సైరన్ వేస్తూ, డ్రాగన్ లైట్ సహాయంతో వారిని సురక్షితంగా అడవిలో నుండి బయటకు తీసుకువచ్చారు. సరైన సమయంలో స్పందించి తమను రక్షించిన ఇబ్రహీంపట్నం పోలీసులకు యువకులు ధన్యవాదాలు తెలిపారు.

కృత్రిమ అవయవాలు పంపిణీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ భగవాన్ మహావీర్ వికలాంగ సహాయత సమితి ఆధ్వర్యంలో ది చేంజ్ మేకర్, హాసి ఫౌండేషన్ సహకారంతో వన్‌టౌన్‌లోని సి.వి.రెడ్డి ఫౌండేషన్ ప్రాంగణంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఉచిత కృత్రిమ అవయవాల పంపిణీ కార్యక్రమం ఆదివారం విజయవంతంగా ముగిసింది. ఈ శిబిరానికి పెద్ద ఎత్తున వికలాంగులు హాజరై సేవలు పొందారు. పదిమంది సాంకేతిక నిపుణులతో ఈ శిబిరాన్ని కొనసాగించారు. వికలాంగులు కొలతలు తీసుకొని గంటల వ్యవధిలోనే వారికి తగిన అవయవాలు సిద్ధం చేసి ఇస్తున్నారు. కృత్రిమ అవయవాలతో పాటు వీల్ చైర్లు, సహాయ కర్రలు వంటి పరికరాలు ఉచితంగా అందజేశారు. పశ్చిమ ఎంఎల్ఎ కార్యాలయ కార్యదర్శి ప్రతిపాటి శ్రీధర్, కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావుతో కలిసి ఆదివారం ఈ శిబిరాన్ని పరిశీలించి సెక్రటరీ ఇంద్ర చంద్ జైన్‌ను వివరాలడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్ కేంద్రంగా 23 సంవత్సరాలుగా వికలాంగులకు సేవలందిస్తున్నామని జైన్ తెలిపారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఈ శిబిరంలో 210 మంది వికలాంగులకు కృత్రిమ అవయాలను అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి స్థలం కేటాయిస్తే విజయవాడ కేంద్రంగా తమ సంస్థ కార్యకలాపాలను కొనసాగించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. స్వచ్ఛంద సంస్థల సభ్యులు ప్రదీప్ జైన్, ఆర్యన్, అనూజ్, అమిత్ ఈ శిబిరంలో తమ సేవలను అందించారు.

తిరుపతమ్మ మహోత్సవానికి సహకరించాలి

ప్రజాశక్తి - వత్సవాయి : ఈనెల 17వ తేదీ నుంచి జరగనున్న శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి పుట్టింటి పసుపు కుంకుమల మహోత్సవ నిర్వహణకు అనిగండ్లపాడు గ్రామస్తులు సహకరించాలని ఏసీపీ తిలక్ కోరారు. అనిగండ్లపాడు గ్రామస్తులతో మాట్లాడుతూ అమ్మవారి చిన్న తిరునాలతో అనిగండ్లపాడు నుంచి అమ్మవారి పుట్టింటి పశువు కుంకుమలు పెనుగంచిప్రోలు తరలించడం ప్రధాన ఘట్టమైన ఈ కార్యక్రమ విజయవంతానికి గ్రామస్తులు సంపూర్ణంగా సహకరించాలని అన్నారు. డాక్టర్లు ఎడ్లబండ్లకు రాజకీయ పార్టీల జండాలు కట్టవద్దని విద్యుత్ శాఖ అధికారులు సూచించిన ఎత్తు మేరకు ప్రబలు కట్టాలని సూచించారు. కుంకుమం తీసుకొచ్చే వంశీకులు కొల్ల ఎంపీటీసీ పొందూరి విజయలక్ష్మి అత్తులూరి అచ్యుతరావు పొందూరి వెంకటేశ్వరరావు నెల్లూరి గోపాలరావు ఓట్ల లక్ష్మయ్య వల్లం కొండ బ్రహ్మం పెంటయ్య, ఎంపీడీవో జి.శ్రీను, విద్యుత్ కోగంటి దుర్గాప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యంకి వెంకట రమణయ్య వర్ధంతి

విజయవాడ : బందర్ రోడ్‌లో గల ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహ పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య 46 వ వర్ధంతి నిర్వహించారు. గ్రంథాలయ అధికారిణి కె.రమాదేవి అయ్యంకి వెంకట రమణయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం రమాదేవి మాట్లాడుతూ రమణయ్య 19 ఏటనే బిపిన్ చంద్ర పాల్‌ని ఆదర్శంగా తీసుకుని ప్రజాసేవ వైపు అడుగు వేశారని తెలిపారు. దేశమంతా గ్రంథాలయాలను స్థాపించిన వ్యక్తిగా, గ్రంథాలయ పితామహుడుగా పేరు గడించారని తెలిపారు. విజయవాడలోని రామ్మోహన్ గ్రంథాలయం స్థాపనలో అయ్యంకి కృషి ఎనలేనిదని పేర్కొన్నారు. అదే మార్గంలో నడుస్తూ గ్రంథాలయాల అభివృద్ధికి చేయూత నిస్తూ గ్రంథాలయాలు అభివృద్ధి చెందటంలో మన వంతు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. విద్యార్థులు అందరూ గ్రంథాలయంలో చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షిస్తున్నాను అని అన్నారు. అనంతరం విద్యార్థులకు పలుపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ అధికారిణి కె. రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

రమణయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

సిఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి మైలవరం : మైలవరం మండలంలోని పలువురు బాధితుల కుటుంబాలకు సిఎం సహాయ నిధి నుండి మంజూరైన ఆర్థిక సహాయాన్ని ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో నాయకులు అందజేశారు. మండలంలో వివిధ గ్రామాల్లో ఇటీవల అనారోగ్యానికి గురై వైద్య చికిత్సలు చేయించుకున్నారని వారికి వైద్య చికిత్సకు సంబంధించి ఆర్థిక సహాయం మంజూరు చేయాలని స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన స్పందించి ఆర్థికసాయం మంజూరు చేయించారని పలువురు టిడిపి నాయకులు పేర్కొన్నారు. రూ.10,01,700 లు 25 మందికి చెక్కుల రూపంలో మంజూరు కాగా వారి కుటుంబ సభ్యులకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ కార్యాలయ ఇన్చార్జి మంత్రి నాగమల్లేశ్వరరావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు లంక లితీష్ తదితరులు పాల్గొన్నారు.

జెఆర్‌సి పూర్వ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని జెఆర్‌సి కళాశాలలో 2019 – 21 విద్యా సంవత్సరంలో ఐకాన్ విద్యార్థి టి.ధృతి ఇటీవల స్పెయిన్ దేశంలో అంతర్జాతీయంగా నిర్వహించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగంలో నిర్వహించిన పోటీల్లో 9 దేశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ధృతి టీం అంతర్జాతీయంగా 2వ స్థానం పొంది 5000 యూరోలు క్యాష్ ప్రైజ్ సాధించింది. ఈ పోటీలను స్పెయిన్ దేశానికి చెందిన సోప్ర స్టేరియా అనే సాఫ్ట్వేర్ కంపెనీ నిర్వహించింది. అంతకుముందు ఈ కంపెనీ వారు భారత దేశంలో నోయిడాలో నిర్వహించిన ప్రిలిమినరీ పోటీల్లో పాల్గొన్న 512 టీంలలో నుండి ధృతి టీం అంతర్జాతీయ పోటీలకు ఎంపికైంది. ఈ ఎంపిక చేసిన టీం మెంబెర్స్‌కి కంపెనీ వారు రాను పోను ఖర్చులు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఈ టీంతో పాటు గైడ్‌గా ఉన్న ప్రొఫెసర్లకు కూడా కంపెనీ వారే ఖర్చులు ఏర్పాటు చేశారు. ధృతి 10వ తరగతి వరకు చేగు విద్యాలయంలో, ఇంటర్ జెఆర్‌సిలో, ప్రస్తుతం మహేంద్ర ఎకోల్ యూనివర్సిటీ హైదరాబాద్‌లో బి టెక్ 3వ సంవత్సరం చదువుతుంది. ఈ విజయం సాధించిన ధృతి, వారి కుటుంబ సభ్యులకు జెఆర్‌సి యాజమాన్యం, ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ అధ్యాపక బృందం శుభాకాంక్షలు తెలిపారు.

12 నుండి నెమలి శ్రీ వేణుగోపాలుని బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - గంపలగూడెం : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా వర్ధిల్లుతున్న నెమలి శ్రీ వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 12న ప్రారంభమై 17వ తేదీ వరకు జరగనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య తెలిపారు. శ్రీ స్వామివారి కళ్యాణానికి ఉమ్మడి కృష్ణ, ఖమ్మం, ఉభయగోదావరి జిల్లాల నుండి అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొంటారని చెప్పారు. ప్రధానంగా 14వ తేదీ రాత్రి స్వామి కళ్యాణం జరగనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. కళ్యాణానికి వేలాదిగా యాత్రికులు తరలివచ్చి, శ్రీ స్వామివారి కృపకు పాత్రులు కావాలని సంధ్య కోరుతూ, ఈ బ్రహ్మోత్సవాలకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

లిటిల్ ఏంజెల్ పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని స్థానిక లిటిల్ ఏంజెల్ పాఠశాల వార్షికోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రైవేట్ పాఠశాలల జగ్గయ్యపేట నియోజకవర్గ అధ్యక్షులు షేక్ ఖలీల్, పాఠశాల పాలకవర్గ ఉపాధ్యక్షులు లయన్ మేజర్ ఎస్‌వివి సత్యనారాయణ విచ్చేసి ప్రసంగించారు. పాఠశాల సెక్రెటరీ, కరెస్పాండెంట్ శ్రీరామ్ బద్రీనాథ్ విచ్చేసి అతిథులకు, తల్లిదండ్రులకు తమ పాఠశాల వార్షిక నివేదిక సమర్పించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన వివిధ ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ జాయింట్ సెక్రెటరీ మొరిశెట్టి రంగారావు, కోశాధికారి అత్తులూరి జగన్నాథ రావు, కమిటీ సభ్యులు కోనవరెడ్డి సత్యనారాయణరావు, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ కె టి ఆచార్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం కమ్మవారిపాలెం గ్రామంలో ఆదివారం కాపా రామ సీతమ్మ ప్రేరణతో కుమారులు కాపా కృష్ణ ప్రసాద్, కాపా రవీంద్రనాథ్, కాపాభాను ప్రసాద్ రూ.3 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రభుత్వ విప్ నందిగామ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య ప్రారంభించారు. నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి, గ్రామ సర్పంచ్, గ్రామస్తులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు. తంగిరాల సౌమ్య మాట్లాడుతూ రామ సీతమ్మ ప్రేరణతో గ్రామ దాహార్తిని తీర్చేందుకు ముందుకు వచ్చిన కాపా సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. గతంలో తాను ఎంఎల్ఎగా ఉన్నప్పుడు గ్రామ ప్రయోజనార్థం బస్ షెల్టర్‌ను ప్రారంభించానని, నేడు ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందని అన్నారు. అనంతరం కాపా రామ సీతమ్మను సౌమ్య శాలువాతో సత్కరించి అభినందించారు.

భళా...గన్నవరం బాలోత్సవం

• పిల్లలను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారు : ఎమ్మెల్యే యార్లగడ్డ • గన్నవరంలో పిల్లల పండగ ప్రారంభం

మాట్లాడుతున్న గన్నవరం ఎంఎల్‌ఎ యార్లగడ్డ వెంకట్రావు

ప్రజాశక్తి-గన్నవరం : పిల్లలు చేస్తున్న ఫోక్ డాన్సులు.. సాంస్కృతిక నత్యాలు.. కోలాటాలు. ఏకపాత్రాభినయాలు.. చూస్తుంటే ఇది బాలోత్సవమా.. బ్రహ్మోత్సవమా అన్న అనుభూతి కలుగుతుందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కితాబిచ్చారు. పిల్లలను ప్రోత్సహిస్తే అద్భుతాలను సృష్టిస్తారని ఈ బాలోత్సవం స్పష్టం చేస్తోందన్నారు. గన్నవరం బాలికల ఉన్నత పాఠశాలలో గన్నవరం బాలోత్సవం తతీయ "పిల్లల పండుగ" వేడుకలు అత్యంత ఉత్సాహంగా అదివారం జరిగాయి. గన్నవరం బాలోత్సవం కమిటీ అధ్యక్షులు బొడ్డు నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ బాల బాలికలు చదువుతో పాటు సాంస్కృతిక, క్రీడా రంగాల్లోనూ, కళాత్మక, సాంఘిక రంగాల్లో రాణించాలని అన్నారు. ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలు ఎన్ని ఉన్నా, ఐఎఎస్, ఐపీఎస్ లో రాణించేది ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులేనని గుర్తు చేశారు. గన్నవరం నియోజకవర్గానికి మంచి చరిత్ర, గుర్తింపు ఉందని దానిని ఇనుమడింప చేసేందుకు తాను కషి చేస్తున్నట్లు తెలిపారు. లక్షల రూపాయలు దాతల నుంచి సమీకరించి ఖర్చు చేయడం ద్వారా పిల్లల్లో దాగివున్న అంతర్గత సజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు పాటుపడుతున్న బాలోత్సవం కమిటీ వారిని ప్రత్యేకంగా అభినందించారు. మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఇదొక చక్కటి కార్యక్రమం అన్నారు. పిల్లల్లో మెకానికల్ స్కిల్స్‌ను తగ్గించి విజ్ఞానం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. మూడు సంవత్సరాలుగా ఈ వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. గుడివాడ డివైఈవో కొండా రవికుమార్ మాట్లాడుతూ.. పసి హదయాల్లో వికాసం పెంపొందించాలని లక్ష్యంతో సాంస్కృతిక, సాంఘిక రంగాల్లో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. నాలెడ్జ్ ఈజ్ పవర్ అనేది బాల బాలికలు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవం కార్యనిర్వాహక అధ్యక్షులు గన్నె వెంకట్రావు, సీనియర్ న్యాయవాది అనుమోలు వెంకటేశ్వరరావు, గన్నవరం బాలోత్సవం కమిటీ ప్రధాన కార్యదర్శి కర్రా వరప్రసాద్, గన్నవరం సర్పంచ్ నిడమర్తి సౌజన్య, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, పుణ్యాచారిటీస్ కార్యదర్శి జాస్తి విజయ భూషణ్ కుమార్, రెడ్ క్రాస్ మాజీ కార్యదర్శి డా.మద్దుకూరి విజయ్ కుమార్, బాలికో ఉన్నత పాఠశాల హెచ్ఎం ఝాన్సీరాణి హాజరయ్యారు. ప్రముఖ వ్యాఖ్యాత కొల్లి సత్య జగదీశ్వరరావు సంధానకర్తగా వ్యవహరించారు.

కాట్రగడ్డ రవీందర్ వేదిక పై పల్లె పడుచుల నత్యాలు, కడియాల రాఘవరావు వేదికపై ఏకపాత్రాభి లయాలు, పుణ్యాచారిటీస్ వేదికపై కోలాట నత్యాలు, బాలసుబ్రహ్మణ్యం వేదికపై ఆనాటి పాటల పోటీలు ప్రత్యేకంగా నిర్వహించారు. బాలోత్సవం కమిటీ సభ్యులు మరీదు వరప్రసాద్, దాసరి నవభారతి, మధుసూదనరావు, పోటీలను పర్యవేక్షించారు. పాత నియోజకవర్గంలోని మూడు మండలాల నుంచి 1200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన వారికి బహుమతులను పంపిణీ చేశారు.

మాట్లాడుతున్న బొడ్డు నాగేశ్వరరావు

విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

డ్యాన్సులతో అదరగొట్టిన చిన్నారులు

• ఆలోచింపజేసిన ప్రదర్శనలు • బాలోత్సవానికి అనూహ్య స్పందన

ప్రజాశక్తి-గన్నవరం : బాలల్లో ఉన్న సజనాత్మకతను వెలికితీసి.. వారిలోని ప్రతిభాపాటవాలను చాటిచెప్పేందుకు గన్నవరంలో ఆదివారం నిర్వహించిన తతీయ పిల్లల పండగ (బాలోత్సవం)కు అనూహ్య స్పందన లభించింది. దాదాపు 38 పాఠశాలలకు చెందిన 1200 మంది బాలబాలికలు 33 అంశాల్లో తమ ప్రతిభను చాటేందుకు పోటీపడ్డారు. గన్నవరం బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 15 వేదికలపై జూనియర్, సీనియర్ విభాగాలకు పోటీలను నిర్వహించారు. కథారచన, భరతనాట్యం, కూచిపూడి, నీతిపద్యాలు, చిత్రలేఖనం, వకత్వం, ఏకపాత్రాభినయం, ఫోక్ డాన్స్, ఫ్యాన్సీ డ్రెస్, స్పెల్బీ, సినీ, లలిత, జానపద గీతాలు, క్విజ్, వ్యర్థంతో అర్థం, ఫ్యాషన్ షో, రైతు, సామాజిక రుగ్మతలపై నాటికలు, బాలికల కోలాటం, ఏకపత్రాభినయంలో బాల బాలికలు ఆద్యంతం ఆకట్టుకునే రీతిలో ప్రదర్శనలు ఇచ్చి చూపర్ల కళ్ళను కట్టి పడవేశారు. అనేక మంది విద్యార్థులు వ్యర్థ వస్తువులతో అద్భుతాలు సష్టించి వేదికపై ప్రదర్శించడం, వాటి ప్రయోజనాలను వివరణాత్మకంగా విశ్లేషించడం ప్రేక్షకులను ఆకట్టుకుంది. బాపులపాడు, గన్నవరం, ఉంగుటూరు మండలాల్లోని వివిధ ప్రైవేటు, ప్రభుత్వ స్కూల్లో నుంచి వచ్చిన బాలబాలికలు చేసిన జానపద, కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. తెలుగు భాష గొప్పదనాన్ని వివరిస్తూ వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థి చేసిన నత్యం ఆకట్టుకుంది. పలువురు చిన్నారులు ఫ్యాన్సీ డ్రెస్, తమ వేషభాషల తో, హావభావాలతో ఇచ్చిన ప్రదర్శనలు ప్రేక్షకులను అలరింపజేశాయి. బాలోత్సవం ప్రధాన కార్యదర్శి కర్రా వరప్రసాద్, అధ్యక్షులు బి.నాగేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షులు గన్నె వెంకట్రావు పోటీలను పర్యవేక్షించారు. నిపుణులైన వ్యక్తులను న్యాయ నిర్ణేతలుగా పెట్టారు. ప్రతిభ చాటిన బాల బాలికలకు బహుమతులను అందించారు.ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పిల్లలు చేసిన అద్భుతాలను చూసి ఆహా.. అనుకున్నారు. కొన్ని గంటలపాటు పిల్లల మధ్యలో గడిపారు. వివిధ పాఠశాలలకు చెందిన బాలికలు అద్భుతంగా జానపద నత్యాలు ప్రదర్శించడాన్ని చూసి అబ్బురపడ్డారు. బాల బాలికలతో కలిసి అధికారులు, ప్రజా ప్రతినిధులు భోజనం చేశారు. పోటీలకు సహకరించిన దాతలకు, పాఠశాలల ఉపాధ్యాయులకు, నిర్వాహకులకు బాల ఉత్సవం కమిటీ ధన్యవాదాలు ప్రకటించింది.

మహిళలకు సన్మానం

ప్రజాశక్తి - నందిగామ : యుటిఎఫ్, సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నందిగామలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నందిగామ యుటిఎఫ్ కార్యాలయంలో అంగన్వాడీ, ఆశా వర్కర్స్, మధ్యాహ్న భోజన ఏజెన్సీ మహిళా నాయకులు, కార్యకర్తలను దుశ్శాలువాలతో సత్కరించారు. యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్, నందిగామ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.విజయలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజాసంఘాల మహిళా నాయకులు, కార్యకర్తలను దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మీ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని,ప్రభుత్వం ప్రోత్సాహం మరింత అందించాలని కోరారు. సిఐటియు నందిగామ మండల కార్యదర్శి కటారపు గోపాల్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు సరళ మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వం అందిస్తే మరింత రాణిస్తారని వివరించారు.

హెడ్ వాటర్ వర్క్స్‌లో మోటార్ ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని స్థానిక హెడ్ వాటర్ వర్క్స్‌లో 60 హెచ్‌పి కొత్త మోటర్‌ను స్థానిక ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎప్పుడో 30 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన 60 హెచ్‌పి, 40 హెచ్‌పి మోటర్లు ప్రతిసారి మరమ్మతులకు గురవడంతో మంచినీటి సరఫరా సరిగా అందడం లేదని ఫిర్యాదులు రావడంతో కొత్త 60 హెచ్‌పి మోటర్‌ను ప్రారంభించినట్లు దీని ద్వారా పట్టణానికి రోజు 30 లక్షల లీటర్ల మంచినీరు అందించే అవకాశం ఉందని, గత పాత మోటార్స్‌తో పోలిస్తే ఎక్కువ కెపాసిటీతో తక్కువ వ్యవధిలోనే ఎక్కువ కుటుంబాలకు నీటి సరఫరా అందజేసే అవకాశం ఉందని, ఇంతకుముందు 24 గంటలు మోటార్ వేయాల్సిన అవసరం ఉండేదని ఇప్పుడు కనీసం రోజుకు ఒక గంట సేపు మోటారుకు విశ్రాంతిని ఇచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనేని రాధాకృష్ణ, కన్నెబోయిన రామలక్ష్మి, కంచేటి గీతారాణి, సంగెపు బుజ్జిబాబు, నకిరకంటి వెంకట్, ఇర్రి నరసింహారావు, పేరం సైదేశ్వర రావు, కర్ల జోజి, కటికల అనిల్, సయ్యద్ అన్వర్, మెడక కోటేశ్వరరావు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - గంపలగూడెం : దశాబ్దాల తదుపరి స్నేహితులంతా ఏకం కావడం అదృష్టంగా భావిస్తున్నట్లు పలువురు పూర్వ విద్యార్థులు కొనియాడారు. గంపలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1974-75 విద్యా సంవత్సరంలో పదవ తరగతి విద్యార్థులు ఆదివారం 5 దశాబ్దాల తదుపరి ఆత్మీయ సమావేశం నిర్వహించుకున్నారు. సందర్భం గా పలువురు పూర్వజ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆయా కుటుంబాల పరిస్థి తులను వేదికపై వెల్లడించారు. అనంతరం పూర్వ గురువులను సత్కరించారు.

ఇంద్రకీలాద్రిపై శాశ్వత అభివృద్ధి పనులు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - వన్ టౌన్ : విజయవాడ ఇంద్రకీలాద్రి అభివృద్ధికి ఎంఎల్ఎ సుజనా చౌదరి ప్రత్యేక దృష్టి సారించారు. యాత్రికులకు శాశ్వత ప్రాతిపదికన మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి ఆలయ అధికారులతో చర్చించి సరికొత్త మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు శ్రీకారం చుట్టారు. దుర్గమ్మ ఆలయం అభివృద్ధిపై ఎంఎల్ఎ సుజనా చౌదరి ఆధ్వర్యంలో తాడిగడప లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం సమీక్ష నిర్వహించారు. సమీక్షలో ఆలయ అధికారులు, ఇంజనీరింగ్ నిపుణులు, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్ట్ అధికారులు, టెక్నికల్ టీమ్ పాల్గొన్నారు. కనకదుర్గ ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి, చేపట్టబోయే పనుల వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలుసుకున్నారు. వివిధ పనులకు సంబంధించిన సాధ్యాసాధ్యాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా అధికారులకు పలు సూచనలు చేశారు. రాబోయే శతాబ్దం అవసరాలకు తగ్గట్లుగా దుర్గగుడి ఘాట్ రోడ్, శాశ్వత క్యూలైన్ల నిర్మాణం, పార్కింగ్ స్థలాల ఏర్పాట్లు, తాగునీటి సౌకర్యాలను మెరుగుపరచడానికి వాటర్ ప్లాంట్ల ఏర్పాటు ఎస్కలేటర్ల నిర్మాణం వంటి

సమావేశంలో ఎంఎల్ఎ సుజనా, ఆలయ అధికారులు

విషయాలపై చర్చించారు. వచ్చే విజయదశమి నాటికి మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కె వి ఎస్ ఆర్ కోటేశ్వరరావు, వైకుంఠేశ్వరరావు, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ హెచ్ ఓ డి శ్రీనివాస్, సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ బి. పాండురంగారావు, టెక్నికల్ టీం సిబ్బంది బోరా శ్రీనివాస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత కార్యాచరణ వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి పట్టణ జనవిజ్ఞాన వేదిక కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సభ సెమినార్ నిర్వహించారు. ఈ సభకు కొండపల్లి మాజీ సర్పంచ్ వెనిగళ్ళ అమ్మాజీ అధ్యక్షత వహించారు. ముందుగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారి సంపసాల శ్రావ్య కూచిపూడి నాట్యం, ఆబిదా గుల్షన్ మహానటి ఏకపాత్రాభినయం, ప్రవల్లిక రాణి రుద్రమదేవి ఏకపాత్రాభినయం, అపర్ణ డాక్టర్ నూరి పది రూపాయల డాక్టర్ పాత్రలను చక్కగా అభినయించారు. కార్యక్రమానికి అతిథులుగా ఇబ్రహీంపట్నం మండల విద్యాశాఖ అధికారి చెరుకూరి పుష్పలత, ఐసిడిఎస్ సూపర్వైజర్ జి.రమాదేవి, జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు పెట్ల కామేశ్వరరావు, ఐద్వా జిల్లా నాయకురాలు వి.రామ సీత పాల్గొని ప్రసంగించారు. మహిళలు, బాల బాలికల ఆరోగ్య, పోషణ విషయాలలో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. పి.కామేశ్వరరావు, బి.రామ సీత మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెవివి

మాట్లాడుతున్న చెరుకూరి పుష్పలత

కొండపల్లి శాఖ అధ్యక్షులు ఎస్.నాగరాజు, జెవివి శాఖ సహాయ కార్యదర్శి ఎ.యలమందయ్య, ప్రజానాట్యమండలి శ్రీనివాస్, అంగన్వాడీ ఉపాధ్యాయులు ఆయాలు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం ఎంఇఒ పుష్పలత, సూపర్వైజర్ రమాదేవి వారిని మహిళా దినోత్సవం సందర్భంగా సన్మానించారు.

లయన్స్ క్లబ్ వేడుకలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : లైన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ స్టైల్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం కె.ఎల్.రావు నగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ వి రావు ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ మహిళా మణులను సత్కరించారు. ముఖ్య అతిథులుగా రీజనల్ చైర్పర్సన్ అన్నే కుసుమ, రాజమండ్రి నగరపాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.స్వరాజ్యలక్ష్మి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి స్టైల్స్ క్లబ్ అధ్యక్షులు నమ్మి అప్పారావు యాదవ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో బి. కమల, పెంటి జ్యోతి, ఎండి రుహీ, వసుంధర, మమత, వెంకటలక్ష్మి తదితరులను సత్కరించారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్.వి.రావు మాట్లాడుతూ పురుషుల కంటే మహిళలు అన్ని రంగాల్లో రాణించబడుతున్నారని పేర్కొన్నారు. జోన్ చైర్పర్సన్ పూర్ణ మాట్లాడుతూ లైన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ స్టైల్స్ ఆధ్వర్యంలో మహిళను గౌరవించడం

మహిళలను సన్మానించిన సభ్యులు

చాలా ఆనందదాయకమని, ఎక్కడైతే మహిళలు గౌరవించబడతారో ఆ దేశం బాగా పురోగతి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ఎండివి ప్రసాద్, లైన్స్ నాయకులు ధీరం శ్రీనివాసరావు, గుగ్గిలం విజయ్ కుమార్, అవ్వరు బుల్లబ్బాయి, బాయన శేఖర్ బాబు, తదితరులు పాల్గొని మహిళల ఔన్నత్యాన్ని కొనియాడారు.

ఘనంగా జుంబా నృత్య వేడుకలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రౌండ్ టేబుల్ ఆఫ్ ఇండియా విజయవాడ లేడీస్ సర్కిల్ ఆధ్వర్యంలో గత కొద్దిరోజులుగా జరుగుతున్న మహిళా దినోత్సవ వేడుకలు ఆదివారం వైభవంగా ముగిసాయి. ముగింపును పురస్కరించుకుని నిర్వహించిన జుంబా నత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తమ లేడీస్ సర్కిల్ ఆధ్వర్యంలో మహిళ దినోత్సవ వేడుకలలో భాగంగా వారం రోజులపాటు విభిన్న సేవ కార్యక్రమాలు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని లేడీస్ సర్కిల్ చైర్పర్సన్ సమీక్ష సేథీ వివరించారు. మహిళా దినోత్సవాన్ని రౌండ్ టేబుల్ ఆఫ్ ఇండియా విజయవాడ లేడీ సర్కిల్ ఆధ్వర్యంలో బందరు రోడ్డులోని స్నాప్ ఫిట్నెస్ సెంటర్లో నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడ లేడీస్ సర్కిల్ చైర్పర్సన్ సమీక్ష సేథి మాట్లాడుతూ వయోవృద్ధులకు దుస్తులు పంపిణీ, పారిశుధ్య కార్మికులకు ఆహారం వివిధ హాస్టల్స్‌లో విద్యార్థినులకు సానిటరీ నాప్కిన్స్ అందజేశామని ఆమె తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన ఓ మహిళకు స్వయం ఉపాధి నిమిత్తం తోపుడు బండి అందజేశామన్నారు. నిరుపేద విద్యార్థులకు స్కాలర్షిప్పు కూడా అందజేసినట్లు ఆమె వివరించారు. లేడీస్ సర్కిల్ ప్రతినిధి సుచిత్ర యోగేష్ మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా తమ లేడీస్ సర్కిల్ ఆధ్వర్యంలోఅనేక సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మహిళల ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించేందుకు వారికి జుంబా డాన్స్ తరహా వ్యాయామ తరగతులు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ లేడీస్ సర్కిల్ కార్యదర్శి వినీల బాయన కోశాధికారి అమూల్య యలమంచిలి, కార్యవర్గ సభ్యులు డింపుల్ కౌర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తిరువూరు : తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా కల్లూరు మండలం పేరువంచ కాకతీయ షుగర్స్ సమీపంలో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో తిరువూరు మండలం కోకిలంపాడుకు చెందిన ఎక్కిరాల సురేష్ (38) మృతి చెందారు. కల్లూరు నుంచి తిరువూరు వైపు ద్విచక్రవాహనంపై వస్తున్న సురేష్‌ను ఎదురుగా వచ్చిన వ్యాను ఢీకొంది. దీంతో సురేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గంపల గూడెం మండలం ఊటుకూరులో ఎక్సైజ్ అధికారులు జరిపిన దాడిలో నాటు సారా తయారీకి సిద్ధం చేసిన 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఎ.కొండూరు మండలం కుమ్మరికుంట్ల గ్రామంలో ఏడు కన్నాల తూము వద్ద ఏర్పాటు చేసిన సారా బట్టీలు పైన కూడా ఎక్సైజ్ అధికారులు మెరుపు దాడి చేసి 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని, 30 లీటర్ల సారా తయారీ కోసం సిద్ధం చేసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఎక్సైజ్ ఎస్ఐ వెంకట కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బదిలీ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : విద్యుత్ సరఫరా వ్యవస్థలో అంకిత భావం తో పని చేసి ప్రజల ప్రశంసలు అందుకున్న ఇబ్రహీంపట్నం ట్రాన్స్‌కో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కావేటి కొండలరావుకు ఉద్యోగోన్నతి దక్కింది. ట్రాన్స్‌కో విభాగంలో సమర్థవంతమైన సేవలు అందించిన ఆయనకు ప్రభుత్వం ప్రమోషన్ ఇచ్చి గౌరవించింది. ఇప్పటివరకు ఇబ్రహీంపట్నం సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ఆయనను బాపట్లకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బదిలీ చేసింది. వరదల సమయంలో పునరావాస కేంద్రాలకు విద్యుత్ సరఫరా అందించడంతో పాటు ముంపు ప్రాంతాల్లో ట్రాన్స్ కో అధికారులు ప్రాణాలకు తెగించి పని చేశారు. బదిలీలో భాగంగా బాపట్ల జిల్లా విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ట్రాన్స్ కో ఇబ్రహీంపట్నం సబ్ డివిజన్ నూతన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా జి.గురు బాధ్యతలు స్వీకరించారు.

ఎంఎల్ఎకు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలో స్థానిక ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్, జనసేన జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభానుకు వేరువేరుగా ఆదివారం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం సదరు సంస్థలో 80 శాతం మంది ఉద్యోగులు రిటైర్మెంట్ పొందగా ప్రస్తుతం 20 శాతం మంది పర్మినెంట్ ఉద్యోగులతోను మిగిలిన ఖాళీల్లో ఔట్సోర్సింగ్ సిబ్బందితో పనిచేస్తున్నారు. తాము గత 18 సంవత్సరాల నుండి ఈ సంస్థను నమ్ముకుని పనిచేస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డిఇఒలు, ఐటి మేనేజర్లు, ఇతర కేడర్‌లలో రాష్ట్ర వ్యాప్తంగా 2,600 మంది సిబ్బంది అవుట్ సోర్సింగ్ విధానంలో అతి తక్కువ జీతాలతో నేటికి రూ.16,411 లు మాత్రమే తీసుకుంటూ తమ భార్య పిల్లలు, వృద్ధాప్యంలో ఉన్న తల్లితండ్రులతో జీవనం సాగిస్తున్నామని తెలిపారు.

ఆక్వా ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి-కోడూరు : ఆక్వా రైతులకు వారి ఆక్వా సాగులో అవసరమైన అన్ని రకాల పరీక్షలను ఉచితంగా అందించేందుకు ప్రముఖ ఆక్వా కంపెనీ షేంగ్ లాంగ్ ఆక్వా కం పెనీ ఆధ్వర్యంలో కోడూరులో ల్యాబ్ ఏర్పాటు చేశారు. ఆర్ఆర్ ఎంటర్ప్రైజెస్ ఆధ్వర్యంలో కోడూరు ప్రధాన సెంటర్లో ఏర్పాటు చేసిన ఈ నూతన ల్యాబ్‌ను షేంగ్లాంగ్ కంపెనీ ప్రతినిధులు ప్రారంభిం చారు. ఈ సందర్భంగా కంపెనీ ఇండియాహెడ్ ప్రతినిధులు మాట్లాడుతూ ఆక్వా రైతు లకు అవసరమైనటువంటి పీహెచ్, వాటర్ సెల్ నెట్ టెస్టింగ్, టోటల్ అలిగినటి, క్యాల్షియం, మెగ్నీషియం టోటల్ హర్డ్నెస్, అమోనియా నైట్రేట్‌తోపాటు అన్ని రకాల పరీక్షలను ఉచితంగా నిర్వహి స్తామన్నారు. అనంతరం రైతులకు ఆక్వా సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సలహాలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ డీజీఎం కుమరేషన్, కరోన్, విక్టర్,నీల్,నిక్, ర్యాండీ, ఆర్ఆర్ ఎంటర్ప్రైజెస్ పేర్ల రమేష్, వసంతరావు సుధా పాల్గొన్నారు.

మంత్రికి ప్రసాదాలు అందిస్తున్న ఈవో కొండలరావు

కొండలమ్మను దర్శించుకున్న మంత్రి కొల్లు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారి రాష్ట్ర గనుల శాఖ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థాన కార్యనిర్వహణా ధికారి, సిబ్బంది, అర్చక స్వాములు స్వాగతం పలికి అమ్మవారి కి విశేషమైన పూజలు చేయించి శాలువాతో సత్కరించి వారికి శ్రీ అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. అలాగే 18 వేల మంది యాత్రికులు అమ్మవారిని దర్శించుకున్న పాల పొంగళ్ళు సమర్పించి వారి మొక్కుబడులను తీర్చుకున్నారు. కొండలమ్మ అమ్మవారి దేవస్థానమునకు దత్తత దేవాలయం అయిన శ్రీ అభయాంజనేయ స్వామి వారి 37వ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం 6 గంటలకు స్వామివారికి స్నపన కార్యక్రమం అనంతరం సహస్ర నాగవల్లి ధర్మపూజ తదుపరి నీరాజనం మంత్ర పుష్పంచేసినట్లు ఇఓ కొండలరావు తెలిపారు

350 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-కోడూరు : వాసవి క్లబ్ దివిసీమ కోడూరు, మండల ఆర్యవైశ్య సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అన్నం అన్నపూర్ణమ్మ చారిటీస్ సౌజన్యంతో ఆదివారం కోడూరులోని ఆర్యవైశ్య ప్రార్థన మందిరంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడ కు చెందిన మెగా స్టార్ హాస్పిటల్ వైద్య సిబ్బంది ఉచితంగా సేవలు అందించారు. ఈ వైద్య శిబిరంలో అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరానికి అన్నం అన్నపూర్ణమ్మ చారిటీస్ అధ్యక్షులు అన్నం శ్రీనివాస్ ఆర్థిక సహకారం అందించారు. ఈ వైద్య శిబిరంలో మండల పరిధిలోని పలు గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని 350 మంది ఉచిత వైద్య సేవలు అందుకున్నారు. అన్నం శ్రీనివాస్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు బూరగడ్డ హరినాద్ బాబు, కిరాణా వర్తక సంఘం అధ్యక్షులు మద్దాళి ప్రసాద్, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జూపూడి సుభా చంద్రబోస్, వాసవి క్లబ్ దివిసీమ అధ్యక్షులు కోడూరు వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

కెవి రమణయ్యనాయుడుకు ఘన నివాళి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కెవి రమణయ్యనాయుడు నేటి యువ రాజకీయ నాయకులకు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. రావుబహద్దర్, మాజీ ఎమ్మెల్యే, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కెవి రమణయ్య నాయుడు 135వ జయంతి కార్యక్రమాలు ఆదివారం ఘనంగా జరిగాయి. రమణయ్యనాయుడు కుటుంబ సభ్యులు విగ్రహ పునరుద్ధరణ కార్యక్రమం చేపట్టిన నేపథ్యంలో జరిగిన వేడుకల్లో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొని రమణయ్య నాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడారు. బ్రిటీషు పాలకులను ధైర్యంగా ఎదురించిన న్యాయవాదిగా కెవి రమణయ్య నాయుడు పేరు పొందారన్నారు. మచిలీపట్నంకు చెందిన కెవి రమణయ్యనాయుడు విగ్రహం ఉండే సెంటర్కు ఆయన పేరు పెడతామన్నారు. ఇందుకు మునిసిపాలిటీలో

రమణయ్యనాయుడు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

తీర్మానం చేయిస్తామన్నారు. మచిలీపట్నంలో జన్మించిన మహనీయుల విగ్రహాలను నెలకొల్పుతామన్నారు. ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, అవనిగడ్డ మండలి బుద్ధ ప్రసాద్, జనసేన నియోజకవర్గ ఇన్ఛార్జి బండి రామకృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బూరగడ్డ అశోక్ పాల్గొన్నారు.

తూముల ఏర్పాటుతో ఇబ్బంది లేదు

ప్రజాశక్తి-నందివాడ : భూమికోడు డ్రైన్ పై నందివాడ మండలం అరిపిరాల గ్రామం వద్ద ఏర్పాటు చేసిన తూముల వలన పరిసర ప్రాంత రైతులకు ఎటువంటి ఇబ్బంది లేదని పాములపాడు డీసీ చైర్మన్ యార్లగడ్డ రవి, తమ్ములపల్లి, రామాపురం మాజీ సర్పంచ్ సాధం సాంబశివరావు, అందుగుల ఏసుపాదంలు పేర్కొన్నారు. మండలంలోని అరిపిరాల గ్రామంలో వారు రైతులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. కొన్ని రోజులుగా భూమికోడు డ్రెయిన్‌పై ఆక్రమంగా చేపల చెరువులకు మార్గం నిర్మించారంటూ కొంతమంది చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. పరిసర ప్రాంతాల్లో పంట భూములకు, గ్రామాలకు ఈ మార్గం వలన ఇబ్బంది కలుగుతుందంటూ చేస్తున్న ఆరోపణలు అవాస్తవ

మన్నారు. పరిసర ప్రాంతాల్లో దశాబ్ద కాలం క్రితమే భూములన్నీ చేపల చెరువులుగా మారిపోయాయన్నారు. చెరువులకు కాల్వల నుండి మార్గం ఏర్పాటు చేసుకోవడం యాదక్రమన్నారు. లీజుదారుడు ఎవరికి ఇబ్బంది లేకుండా పగడ్బందీగా తూములు ఏర్పాటు చేసి రహదారి నిర్మించారన్నారు.

తడి,పొడి చెత్తపై అవగాహన

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ మండలంలోని బొమ్ములూరు గ్రామంలో ఆదివారం మండల ప్రత్యేక అధికారి పి.బి సాల్మాన్‌రాజు తడి చెత్త, పొడి చెత్తను వేరుచేసే విధానాన్ని పరిశీలించి, వీటిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరిగే పి4 సర్వేను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బివై విష్ణుప్రసాద్, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి రామమోహనరావు, సచివాలయం సిబ్బంది,

తడి,పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు సత్కారం

పెనమలూరు : అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం పెనమలూరు మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవ సభ పోరంకి కార్యాలయంలో శనివారం జరిగింది. ఈ సభలో పెనమలూరు మహిళా ఎస్సై ఉషారాణి, పుచ్చలపల్లి సుందరయ్య శిష్యురాలు రామినేని విజయ, పోరంకి హై స్కూల్ హెడ్మాస్టర్ మేడం సుమలత, మహిళా సంఘం పెనమలూరు మండల కార్యదర్శి పాతాళ లక్ష్మి, అధ్యక్షురాలు వలివి, అంగన్వాడీ లీడర్ లక్ష్మీ ప్రసన్న మున్సిపల్ వర్కర్స్ లీడర్ వై సరళ, అనేకమంది మహిళలు సిఐటియు నాయకులు మస్తాన్వలి, త్రిమూర్తులు, ప్రజానాట్యమండలి నాయకుడు షేక్ ఖాసిం, పి శ్రీనివాసరావు, రెడ్డి, మోహన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సైను సుమలతను రామినేని విజయను, నాగమణిని వారి, వారి రంగాలలో వారు చేసిన సేవలను కొనియాడుతూ వారిని సత్కరించారు.

దావులూరులో మహిళా దినోత్సవం వేడుకలు

ప్రజాశక్తి-కంకిపాడు : ప్రపంచ మహిళా దినోత్సవ సందర్భంగా దావులూరు గ్రామ సర్పంచ్ కొప్పుల లక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కంకిపాడు మండల ఎంపిపి నెరుసు రాజ్యలక్ష్మి పాల్గొని ప్రసంగించారు. మహిళలు పని ప్రదేశాలలో ఏ సమస్య ఉన్న ధైర్యంగా పోరాడాలని అన్నారు. ఉపసర్పంచ్ కందుల పద్మజ, అన్నె కిరణ్మయి, బేతపూడి సురేష్, పంచాయితీ రాజ్ అసోసియేట్ కష్ణ, పంచాయితీ కార్యదర్శి రాయపూడి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక టిడిపి కార్యాలయంలోని ప్రజావేదికలో గీతభవన్ రోడ్డులోని శ్రీ వేణుగోపాల స్వామివారి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవ వేడుకల ఆహ్వాన పత్రికలను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత పురాతనమైన శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవస్థానంలో ఈనెల 12వ తేదీ నుండి 14వ తేదీ వరకు జరగనున్న వార్షిక మహోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నా యన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో గోపాలరావు, టిడిపి నాయకులు చేకూరు జగన్మోహన్రావు, వేద పండితులు పాల్గొన్నారు.

కళ్యాణ వేదిక నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-గన్నవరం : శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ కళ్యాణ వేదిక నిర్మాణానికి గన్నవరం శివారు మర్లపాలెం కి చెందిన వెంకట చలపతిరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు మేడసాని వెంకట రామకృష్ణారావు-భార్గవి దంపతులు 50,020 రూపాయలు విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు జాస్తి శ్రీధర్ రావు, టిడిపి నాయకులు జాస్తి ఫణి శేఖర్ పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవ సంస్థ వల్లూరు పాలెం వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా మెడికల్ క్యాంపును నిర్వహించారు. పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, రాష్ట్ర ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు లు రిబ్బన్ కట్ చేసి క్యాంపును ప్రారంభించారు. స్వచ్ఛంద సేవ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు చింతపల్లి వెంకటేశ్వరరావు, ప్రస్తుత అధ్యక్షులు బడుగు శ్రీకాంత్ ,ప్రధాన కార్యదర్శి మక్కిన సుబ్రహ్మణ్యంలను క్యాంప్ నిర్వహించినందుకు అభినందించారు. సెంటిని హాస్పిటల్ విజయవాడ డాక్టర్ కాగిత కష్ణ చంద్ ఆధ్వర్యంలో రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరవనేని శివరాం ప్రసాద్, పిఎసిఎస్ బ్యాంక్ అధ్యక్షులు ఆచంట కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ చెన్నుపాటి పూర్ణచంద్ర రావు, బొడ్డపాడు గ్రామ సర్పంచ్ మూడే శివశంకర్ రావు, రిటైర్డ్ హెడ్ మాస్టర్ లంక వెంకటేశ్వరరావు, చెన్నుపాటి శ్రీధర్, చిట్టి బొమ్మ వెంకటశివరావు , వాడపల్లి సమీర్ , జుజ్జువరపు సద్గుణ రావు మరియు హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు. ఈ క్యాంపులో సుమారు 150 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

మృతుడి కుటుంబసభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి-చల్లపల్లి : ఇటీవల ప్రమాదానికి గురై మృతిచెందిన లక్ష్మీపురం పంచాయతీ శివారు రామానగరం దళిత వాడకు చెందిన కొల్లూరి నానయ్య కుటుంబ సభ్యులను మాజీ శాసనసభ్యులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అవనిగడ్డ నియోజకవర్గ కన్వీనర్ సింహాద్రి రమేష్ బాబు ఆదివారం పరామర్శించారు. దళితవాడలోని నానయ్య ఇంటికి నానయ్య భార్య, 9వ వార్డు సభ్యురాలు సుజీ రాణి, కుమారులు నవీన్, నరేంద్ర, కుమార్తె నలిని కుమారీలను పరామర్శించి ఓదార్చారు. అనంతరం నానయ్య చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చల్లపల్లి మండల కన్వీనర్ శీరం వెంకట సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు మోపిదేవి ద్వారకానాథ్, వైసిపి నాయకులు మత్తి రాంబాబు పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ

విజయవాడ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఓపెన్ హార్ట్ సోషల్ ఆర్గనైజేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విజయవాడలోని పలు ప్రాంతాల్లో శనివారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. కష్ణలంక, వన్‌టౌన్ చిట్టినగర్ కొండిపాంతమైన మల్లికార్జునపేట, విద్యాధరపురం అప్పలస్వామి స్కూల్ ప్రాంతం, రామవరప్పాడు పంటకాలువ సరిహద్దు తదితర ప్రాంతాల్లో సుమారు 2000 మంది నిరుపేద మహిళలు చీరలను పంపిణీచేశారు. భోజనం ప్యాకెట్లను కూడా పంపిణీచేశారు. ఓపెన్ హార్ట్ సోషల్ ఆర్గనైజేషన్ ఫౌండర్ ట్రస్టీ రాసంశెట్టి నందకిశోర్, ట్రస్ట్ ప్రెసిడెంట్ తనూజారాణి పాల్గొన్నారు.

కాటి కాపరులతో మాట్లాడుతున్న మాల్యాద్రి, క్రాంతికుమార్

11న కాటికాపరుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి - విజయవాడ : స్మశానంలో గుంటలు తీసి, పూడ్చి, కాల్చే కాటికాపురుల సమస్యలు పరిష్కారం కోసం 11న విజయవాడ ధర్నా చౌక్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, జిల్లా అధ్యక్షులు గండిమెడ క్రాంతికుమార్ తెలిపారు. సున్నపు బట్టీలు సెంటర్‌లో గల దళిత క్రైస్తవ స్మశాన వాటికలను పరిశీలన చేసి పనిచేస్తున్న కాటికాపురులు కలిసి సమస్యలడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అండ్ర మాల్యాద్రి, గుండిమెడ క్రాంతికుమార్ మాట్లాడుతూ రెండు స్మశానాల్లో పది కుటుంబాలు ఆధారపడి పనిచేస్తున్నాయని, వీరు కాక మరికొన్ని కుటుంబాలు భవన నిర్మాణ, టైల్స్, పెయింటింగ్ కుటుంబాలు కూడా ఆధారపడి జీవిస్తున్నాయని అన్నారు. స్మశానాల్లో వృత్తి చేస్తున్న వారందరికి గుర్తింపు కార్డులు ఇచ్చి 4వ తరగతి ఉద్యోగులుగా నియమించాలని డిమాండ్ చేశారు. వయసు నిండిన వారిందరికి రూ.8వేలు పెన్షన్ ఇవ్వాలని తదితర డిమాండ్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆంటోని, కోటేశ్వరావు, సత్తిబాబు, నవీన్, ఆదాం తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో 90 శాతం క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫ్రెండ్లీ మ్యాచ్ ఆదివారం నిర్వహించారు. జడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో వెట్రన్ క్రికెటర్స్ అందరూ కలుసుకొని ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడుకొని గతంలో జడ్పీ స్కూల్లో విద్యను అభ్యసిస్తూ విరామ సమయంలో స్కూల్ ఆవరణలో ఆడిన మధుర క్షణాలను గుర్తు చేసుకుంటూ నందిగామ సీనియర్ క్రికెటర్లను సన్మానించారు.

ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి - నందిగామ : ఆరోగ్యమే మహాభాగ్యం అన్న పెద్దల మాటలు నేడు సమాజంలో ఎంతో అరుదైన పదాలుగా కనిపిస్తున్నాయని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. ఆదివారం నందిగామ పట్టణం కాకాని నగర్‌లో అమృత ఆర్థో క్లినిక్‌లో మణిపాల్ హాస్పిటల్ విజయవాడ వారి సౌజన్యంతో మెడికల్ లేబరేటరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేన్సర్ స్క్రీనింగ్, గుండె జబ్బులు ఉచిత ఆరోగ్య పరీక్ష శిబిరాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి, కూటమి నాయకులు కలిసి సౌమ్య ప్రారంభించారు. నందిగామ మెడికల్ లేబరేటరీ అసోసియేషన్ సేవలు అందరూ వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి చైర్మన్ ఏపూరి నాగేశ్వరరావు, కార్యక్రమ నిర్వాహకుల ప్రతినిధి సురా బత్తుల కోటేశ్వరరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : భగత్‌సింగ్ ఆటో వర్కర్స్ ఓనర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గత 20 సంవత్సరాలుగా రాఘవరెడ్డి రోడ్డు పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కాలేజీ వద్ద నిర్వహిస్తున్న వేసవి చలి వేంద్రాన్ని ఆదివారం వెంపాడ నూకమ్మ ప్రారంభించారు. చిల్లా సత్తారావు మజ్జిగ పంపిణీని ప్రారంభించారు. బోయి మునలితల్లి, చిల్లా రాజు, విడుదల రవణమ్మల జ్ఞాపకార్థంగా ప్రారంభించిన ఈ చలివేంద్ర కార్యక్రమంలో 50వ డివిజన్ కార్పొరేటర్ సత్యబాబు, మాజీ కార్పొరేటర్ గాదె ఆదిలక్ష్మి, భగత్ సింగ్ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు రాంబాబు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

ఆక్రమణలో ఫీడర్ రోడ్డు

రోడ్డుపైనే వ్యాపారాలు, వాహనాల పార్కింగ్

ప్రజాశక్తి - విజయవాడ : కృష్ణలంక ఫీడర్ రోడ్డు (22వ డివిజన్ స్వర్గపురి రోడ్డు వద్ద నుంచి రామలింగేశ్వర్‌నగర్ వరకు) ఆక్రమణలకు గురవుతూ పార్కింగ్ ప్రదేశంగా తయారయింది. దీంతో ఈ రోడ్డుపై మనిషి నడవాలన్నా... బైక్/కారులో ప్రయాణించాలన్నా... చాలా ఇబ్బందిగా తయారయింది. తరుచూ ఈ రోడ్డులో ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వీటిని నియంత్రించడం కానీ... రోడ్డు ఆక్రమణ కాకుండా పర్యవేక్షించడం కానీ మచ్చుకైనా కనిపించడం లేదు. ప్రధానంగా విఎంసి అధికారులతో పాటు ట్రాఫిక్ పోలీసులు, సంబంధిత అధికారులు పట్టించుకోకుండా పూర్తిగా విస్మరించారు. ఏదైనా జరగరాని ఘటన/ప్రమాదం చోటు చేసుకున్న సమయంలోనో... మీడియాలో కథనాలు వచ్చిన సమయంలోనో ఉలిక్కి పడ్డట్టుగా... సంబంధిత అధికారులు ఫీడర్ రోడ్డును ఆధారం చేసుకొని చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగించే హాకర్స్‌పై తమ ప్రతాపం చూపిస్తూ...అసలు సమస్యను కావాలనే విస్మరిస్తున్నారనే దానికి రోడ్డు దుస్థితే నిదర్శనంగా నిలుస్తుంది. రోడ్డుకు అటు...ఇటు.. అడుగడుగునా అడ్డంకులు...ఆక్రమణలతో నిండిపోయింది. రోడ్డుపైనే స్క్రాప్ బిజినెస్ భారీ మొత్తంలో జరుగుతుంటుంది. స్వర్గపురి రోడ్డు దగ్గర నుంచి పరిశీలిస్తే...బందర్ లాకులు ఎదురుగా ఉన్న ఫీడర్ రోడ్డు వరకు ఈ బిజినెస్ రోడ్డును ఆధారం చేసుకొని లక్షల వ్యాపారం నడుస్తుంటుంది. లారీలను నడిరోడ్డుపైనే ఉంచి స్క్రాప్ సరుకు లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తుంటారు. 22వ డివిజన్ మొదటి (స్వర్గపురి రోడ్డు) నుంచి 21, 20, 18, 17, 16, 15వ డివిజన్ వందల సంఖ్యలో రోడ్డుకిరువైపుల కార్లు, ఇతర వాహనాలు పార్కింగ్ చేస్తుంటారు. ముఖ్యంగా 21, 20 డివిజన్ల పరిధిలో రోడ్డు మార్జిన్ స్థలం తమ సొంత స్థలం అయినట్లు...ఆ స్థలంలో మరొకరికి సంబంధించిన ఏ చిన్న వాహనాన్ని/బైక్‌ను కూడా పార్కింగ్ చేసుకోనీయరు. మరో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే...రోడ్డుకిరువైపుల వారి వాహనాల స్థానంలో మరొకరు ఎవరైనా అత్యవసరంగా పార్కింగ్ చేసుకుంటే...అటువంటి వారి వద్ద నుంచి ఫార్కింగ్ ఫీజులు వసూలు చేస్తుంటారని స్థానికులు వివరిస్తున్నారు. అంతేగాక ఎవరయినా జీవనోపాధి కోసం చిరు వ్యాపారులు/హాకర్స్ రోడ్డు మార్జిన్‌లో వారి బండ్లు పెట్టుకుంటే...వాటి ఎదురుగా ఉండే వారికి కప్పం (పన్ను) కట్టాల్సిందేనంటూ బాధిత పలువురు వ్యక్తం చేస్తున్నారు.

ఫీడర్ రోడ్డులో పార్కింగ్ చేసిన వాహనాలు

రోడ్డు మార్జిన్ స్థలాలను వారి సొంత స్థలాల మాదిరిగా మరొకరికి అద్దెకిస్తుంటారు. పెద్ద పెద్ద షాపుల వారు రోడ్డు ముందుకల్లా వచ్చి...వ్యాపారులు చేస్తున్నారు. 22వ డివిజన్‌లో విజయాబార్, దుర్గాబార్, 21వ డివిజన్‌లో సత్యం హోటల్ సెంటర్‌లో కొత్తగా మద్యం షాపు... ఇలా ఫీడర్ రోడ్డు వెంబడి 24 గంటల పాటు వ్యాపారాలు జోరుగా సాగుతుంటాయి. మందుబాబులు రోడ్డుపైనే వీరంగం వేస్తుంటారు. అయినా ఎక్సైజ్‌శాఖ, సివిల్ పోలీసులు నియంత్రించకపోగా, వాటి దగ్గరకొచ్చి లంచం పుచ్చుకొని... తాగిపోతుంటారనే చర్చ బహాటంగానే వినిపిస్తుంది. రోడ్డుకిరువైపులా జోరుగా వ్యాపారాలు, వాహనాల పార్కింగ్‌తో క్రమంగా ఫీడర్ రోడ్డు కుదించుకుపోతూ...ప్రమాదాలకు నిలయంగా మారి, పాదచారులు కనీసంగా నడవటానికి కూడా వీలు లేని వైనంగా తయారయింది. ఇప్పటికయినా సంబంధిత అధికారులు మేల్కొని చిత్తశుద్ధితో ఆక్రమణలు తొలగించి, ఫీడర్ రోడ్డు రాకపోకలకు అనువుగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని కృష్ణలంక వాసులు కోరుతున్నారు.

ప్రజాచైతన్య యాత్రల దృష్టికి పలు సమస్యలు

ప్రజాశక్తి - విజయవాడ : మిలిటెంట్ పోరాటాలే ప్రజాసమస్యలకు పరిష్కారమని, అందుకు సిపిఎం సిద్ధమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ అన్నారు. పలుచోట్ల ప్రజాచైతన్య యాత్ర నిర్వహించారు. కృష్ణలంక 21వ డివిజన్‌లో ఆదివారం 'ప్రజాచైతన్య యాత్ర' సిపిఎం తూర్పు సిటీ కమిటీ ఆధ్వర్యంలో విస్తృతంగా జరిగింది. వీధి వీధికీ, ఇంటింటికీ తిరుగుతూ ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను నాయకులు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా గతం కన్నా అధికంగా విద్యుత్ బిల్లులు వస్తున్నాయని, కలుషితమైన, దుర్వాసనతో కూడిన నీరు పైప్‌ల ద్వారా వస్తుందని, చేసేది లేక వాటినే తాగాల్సి వస్తోందని, పగటి పూట కూడా ఇళ్లల్లో ఉండలేని స్థితి తయారయిందని, కరకట్ట దిగువన కుక్కల బెడద ఎక్కువైందని, గంజాయి గాళ్ల ఆగడాలు ఎక్కువయ్యాయని స్థానికులు ప్రజాచైతన్య యాత్ర దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ ప్రజాచైతన్య యాత్రల ద్వారా ప్రజాసమస్యలను తెలుసుకుంటామన్నారు. సిపిఎం తూర్పు సిటీ కమిటీ కార్యదర్శి పి.కృష్ణ మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఏదో ఒక సమస్య వెంటాడుతున్న తరుణంలో సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు ప్రజలను కలుపుకొని ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి.రమణ, శివాజి, శ్రీరాము, అప్పలనాయుడు, శ్రీను కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాంబే కాలనీ 'ఈ' బ్లాక్‌లో సిపిఎం నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను స్థానిక ప్రజలు నాయకులకు వివరించారు. దోమలు విపరీతంగా పెరిగిపోయాయని, నీళ్లు మురికిగా వస్తున్నాయని తాగటానికి పనికి రావటం లేదని, దీంతో మినరల్ వాటర్ కొనుక్కొని తాగాల్సి వస్తుందని స్థానికులు వివరించారు. విద్యుత్ బిల్లులు రెండు, మూడు వందలు అదనంగా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు కె.దుర్గారావు మాట్లాడుతూ ప్రజాసమస్యలను తెలుసుకొని, ప్రజలను చైతన్యపరిచి, ఉద్యమాల ద్వారా వాటి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు ఎస్‌కె పీరు సాహెబ్, శాఖ కార్యదర్శి ఎ.రత్నకుమారి, డి.కనకదుర్గ, ఎస్.అప్పన్న పాల్గొన్నారు. కృష్ణలంక 22వ డివిజన్ భ్రమరాంబపురం సిపిఎం కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. మురుగు కాలవలు తీయట్లేదని, డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్నంగా తయారయిందని, శానిటేషన్ అస్తవ్యస్తంగా, దోమలు బెడద, మంచినీటి పైపుల్లో మురుగునీరు సరఫరా అవుతుందని తదితర సమస్యలను స్థానిక నాయకుల దృష్టికి ప్రజలు తీసుకొచ్చారు. సిపిఎం తూర్పు సిటీ కార్యదర్శివర్గ సభ్యులు బత్తుల చిన్నారావు మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి సిపిఎం నిర్వహిస్తున్న ఈ ప్రజాచైతన్య యాత్రకు ప్రజల మద్దతు నివ్వాలని కోరారు. సిపిఎం నాయకులు వాజ శ్రీనివాసరావు, తూబాటి తాండవ కృష్ణ, కొమ్మూరి ఆనంద్, కొప్పిశెట్టి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

ఎ.కొండూరు మండలం పాత కొండూరు దళితపేట పేద రైతులు, కూలీలు సాగు చేసుకుంటున్న భూ సమస్యను ఆదివారం సిపిఎం ప్రజాచైతన్య యాత్ర దృష్టికి తీసుకొచ్చారు. పాతకొండూరు దళిత పేట పేద రైతులు సాగు చేసుకుంటున్న పెదబీడులో 1977లో ప్రభుత్వం ఇచ్చిన 45 ఎకరాల భూమిని, గత 48 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నామని, అయినా ప్రభుత్వం తమకు పట్టాలివ్వలేదని స్థానిక పేద రైతులు వివరించారు. భూమి సమస్య పరిష్కారానికి ఈనెల 24న తహాశీల్దార్ కార్యాలయం వద్ద రైతులు ఆందోళన చేయాలని నిర్ణయించారు. దీనిపై సిపిఎం జిల్లా కార్యదర్శి డివి కృష్ణ మాట్లాడుతూ పేద రైతులను కూటమి ప్రభుత్వం మోసం చేస్తుందని దుయ్యబట్టారు. ఎన్‌టిఆర్ జిల్లాలో దళిత, పేద రైతులు ఏళ్ల తరబడి సేద్యం చేసుకుంటూ ఫలసాయం పొందుతున్నా దానిపై హక్కు కల్పించడం లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.కొండూరు మండల కార్యదర్శి పి.ఆనందరావు, సిఐటియు మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు, రైతు సంఘం మండల అధ్యక్షులు ఎ.అమ్మిరెడ్డి, స్థానిక రైతు, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు, కార్యకర్తలు, పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

సిపిఎం 58వ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో

గత ప్రభుత్వం ఇళ్ల బాండ్‌లు ఇచ్చి స్థలాలు కేటాయించాం అన్నారు, స్థలాలు చూపలేదని యాత్ర దృష్టికి ప్రజలు తీసుకొచ్చారు. కొద్ది మందికి ఇల్ల స్థలం చూపించి ఇల్లు కట్టి ఇస్తామని అన్నారని, సగంలో ఆపేశారని, కొంత డబ్బు కట్టించు కున్నారని తెలిపారు. టి డ్కో ఇళ్ళ కు డబ్బులు కట్టించుకున్నారు ఇంతవరకు ఇల్లు కేటాయించలేదని, బృందం దృష్టికి తీసుకువచ్చారు. సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావు మాట్లాడుతూ ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై పోరాటాలు చేస్తామని సచివాలయాల్లో అర్జీలు నిరసన కార్యక్రమాలతో ప్రారంభించి ప్రభుత్వ కార్యాలయాల వద్ద ధర్నాలకు సిద్ధం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు ఎస్‌కె.నిజాముద్దీన్ పార్టీ డివిజన్ కార్యదర్శులు వి.సాంబశివరావు పాల్గొన్నారు. **నందిగామ :** రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సమస్యలపై ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఆదివారం నందిగామలో జి ప్లస్ త్రీ ఇళ్ల నిర్మాణం చేసిన హనుమంతుపాలెం గ్రామంలో సిపిఎం బృందం పర్యటించింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నందిగామ కార్యదర్శి కె.గోపాల్ మాట్లాడారు. సిపిఎం నందిగామ కమిటీ సభ్యులు సయ్యద్ ఖాసిం, కరి వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

21వ డివిజన్‌లో సమస్యలు వివరిస్తున్న స్థానికులు

ఎ.కొండూరులో భూముల వద్ద రైతులతో డి.వి.కృష్ణ

22వ డివిజన్‌లో సమస్యలు వివరిస్తున్న స్థానికులు

వాంబేకాలనీలో సమస్యలు వివరిస్తున్న స్థానికులు

58వ డివిజన్‌లో సిపిఎం బృందం ప్రజా చైతన్య యాత్ర

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.